

తొలివెలుగు జాతీయపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 9491134365

TGTEL/26/A6221

# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA

**విలేకరులు కావలెను**

తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 45 | గురువారం | 10 సెప్టెంబర్ 2026 | ఎడిటర్ యంజాల ప్రవీణ్ | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvangiri | Volume: 01 | Issue.45 | Thursday | 10.9.2026 | Editor: Yamjala Praveen | pages: 8 | cost. 2/ |



# ప్రతి వారం ప్రజల మధ్యనే ఉంటా

- కోనసీమ జిల్లాలో 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభ
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు
- గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుతూ రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన
- 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించినట్టు వెల్లడి
- భూమికి పూర్తి భద్రత కల్పించేలా రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాలు
- రూ.240 కోట్లతో ఈపీడీసీఎల్ గ్రిడ్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన

సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు మూల మంత్రాలతోనే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సచివాలయానికి పరిమితమై పనిచేయడం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య ఉంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపడమే అసలైన సుపరిపాలన అని, దానికోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఉద్ఘాటించారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గంలోని మాచడవ పండువారిపేటలో బుధవారం నిర్వహించిన 'మీ భూమి – మీ హక్కు' గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

- మిగతా 2వ పేజీలో

# మైలపడ్డది నేలకాదు.. మీ మనస్సు

- నీళ్లతో కడగాలా.. యాసిడ్‌తోనా?
- బాధ్యులపై అట్రాసిటీ కేసులు పెడ్తం
- వాళ్లకు తెలంగాణ సమాజం బెయిల్ ఇవ్వదు
- స్పీకర్‌ను అవమానించినోళ్లను వదలం
- కుట్రలో భాగస్వాములైనోళ్లను శిక్షిస్తం
- ఉగ్రవాది కసబ్‌కు, స్పీకర్‌ను తిట్టినోళ్లకు తేడా లేదు
- అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్?

హైదరాబాద్, వెలుగు: శుద్ధి చేయాల్సింది దళితులు నడిచిన నేలను కాదని, కేసీఆర్ కుటుంబం మనస్సుల్లో పేరుకుపోయిన రాచరికపు అహంకారాన్ని, కుల వివక్షను, అంటరానితనాన్ని యాసిడ్‌తో కడిగి శుద్ధి చేయాలని సీఎం రేవంత్?రెడ్డి అన్నారు. స్పీకర్ స్థానాన్ని అవమానించిన తీరును నిరసిస్తూ దళిత సమాజం ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వైపు దప్పుదరువుతో ప్రజాస్వామ్యబద్ధంగా కదిలిందని, దీనికే ఫామ్‌హౌస్? దారులను పసుపునీళ్లతో శుద్ధి చేశారంటే ఇంతకంటే అవమానం, క్రూరత్వం మరోటి లేదని అన్నారు. బుధవారం అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "దళితులు అడుగుపెట్టిన ఫామ్‌హౌస్ చుట్టూ ఉన్న నేలంతా మైలపడడంతో కేసీఆర్ ఆదేశాల మేరకు పసుపు నీళ్లతో శుద్ధి చేశాం అని చెప్పి.. ఆ ఫోటోలు, పేపర్లలో వచ్చిన వార్తలను ట్యాగ్ చేసి సోషల్ మీడియాలో బాహాటంగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇంతకంటే అవమానం, ఇంతకంటే క్రూరత్వం ఇంకొకటి ఉంటుందా? మధ్యయుగాల నాటి చక్రవర్తులు కూడా ఇంత నీచంగా వ్యవహరించలేదు. రాతి యుగాల్లో అడవుల్లో ఆకులు అడ్డం కట్టుకొని బతికిన వాళ్లు కూడా ఇలాంటి ఆలోచనలు చేయలేదు. 40 ఏండ్లు ప్రజాజీవితంలో ఉండి, ఏ దళితుల ఓట్లతోనైతే పదేండ్లు సీఎంగా గద్దెనెక్కారో.. ఈరోజు అదే దళిత జాతిని

- మిగతా 2వ పేజీలో



## ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర..

- స్పీకర్‌ను దూషించడంపై రేవంత్ ఆగ్రహం
- ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధమని వెల్లడి
- బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారని విమర్శ
- స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదని వ్యాఖ్య

2లో



ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు..

## ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు

- అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసిన స్పీకర్
- బీఆర్ఎస్ సభ్యులను కక్షపూరితంగా సస్పెండ్ చేశారన్న హరీశ్
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నామనే భయంతోనే కుట్రలు చేస్తున్నారని మండిపాటు

2లో

# చంద్రబాబు అరెస్ట్ సమయంలో కొండంత బలమిచ్చారు

- ప్రజా ప్రభుత్వ ఏర్పాటులో ఎన్నారైల కృషి మరువలేనిదని కొనియాడిన మంత్రి లోకేశ్
- తెలుగుజాతిని ప్రపంచంలో నెం.1గా నిలిపే బాధ్యతను సమిష్టిగా తీసుకుందామని పిలుపు
- చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా నిరసనలకు పిలుపు
- 2029 ఎన్నికల్లోనూ ఎన్డీయేను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టీకరణ
- రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకుని, పెట్టుబడులకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలన్న లోకేశ్



2024 ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం ఏర్పడటంలో ప్రవాస తెలుగువారి (ఎన్నారై) పాత్ర మరువలేనిదని, వారి అండతోనే తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడిందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. తెలుగుజాతిని ప్రపంచ యవనికపై నంబర్ వన్ స్థానంలో నిలిపే బాధ్యతను అందరం కలిసికట్టుగా తీసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. 2029 ఎన్నికల్లో కూడా ఎన్డీయే కూటమిని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన ఎన్నారై టీడీపీ సెంట్రల్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ-స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా, నూతనంగా ఎన్నికైన సభ్యులతో ఎన్నారై సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి

- మిగతా 2వ పేజీలో



## దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

- ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్‌కు గ్రీన్ సిగ్నల్
- అరక్కోణం-రేణిగుంట మధ్య 3వ, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం
- మూడు ప్రాజెక్టుల కోసం రూ. 10,021 కోట్లు కేటాయింపు

ఏపీ, తెలంగాణలో రైల్వే సామర్థ్యం పెంచడమే లక్ష్యం రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో సహా దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం మీడియాకు వెల్లడించారు.

## సొంత మహిళా ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ నేతలే తోసేశారు

- అసెంబ్లీ ఘటన వివాదంలో కొత్త కోణం
- సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేలను తోసేశారంటూ బీఆర్ఎస్ నేతలపై మంత్రి సీతక్క ఆరోపణ
- గాయపడిన మహిళా పోలీసులను పరామర్శించిన సీతక్క



2లో

## స్థానిక ఎన్నికల్లో మనం గట్టిగా నిలబడాలి..

- ఎన్నికలు ఎప్పుడైనా సిద్ధం.. సాఫీగా జరిగితే మనదే విజయం
- స్థానిక ఎన్నికలపై చంద్రబాబు మేకపోతు గాంభీర్యం
- కోర్టు కొట్టేసినా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అంటూ డ్రామాలు
- ప్రజలకు తోడుగా కార్యకర్తలుండాలి..వారికి తోడుగా పార్టీ ఉంటుంది
- శ్రేణులకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం

అమరావతి: వైఎస్సార్‌సీపీ పాలనకు, చంద్రబాబు పాలనకు మధ్య స్పష్టమైన తేడా కనిపిస్తోందని, ఇది ప్రతి ఇంట్లో చర్చనీయాంశంగా మారిందని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు హామీలు, మోసాలపైనే ప్రతి ఇంట్లోనూ చర్చ జరుగుతోందని, వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనను, చంద్రబాబు రెండున్నరేళ్ల పాలనను ప్రజలు పోల్చి చూసుకుంటున్నారని అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నేతలు, ముఖ్య కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు.. జరుగుతున్న పరిణామాలను వివరిస్తూ..

- మిగతా 2వ పేజీలో



## 22ఏ భూములు విడిపించాలె

- పేదల భూములు చేర్చడం అన్యాయం
- రాష్ట్రాన్ని పదేండ్లు దోచుకున్న బీఆర్ఎస్
- నాపై 109 కేసులు పెట్టినా భయపడలే
- తెలంగాణలో వచ్చేది బీజేపీ సర్కారే
- కేంద్ర మంత్రి బండి సంజయ్

2లో



## 22ఏ భూములు విడిపించాలె

రాష్ట్రంలో 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టిన భూములను వెంటనే విడిపించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. పేదలు కష్టపడి కొనుక్కున్న సుమారు కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టి దోచుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని ఆరోపించారు. దీనికి అసలు సూత్రధారి మంత్రి పొంగులేటి కాదా? అని ప్రశ్నించారు. భద్రాచలంలో బుధవారం బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కుటుంబం పదేళ్ల రాష్ట్రాన్ని దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మంత్రి, ఎమ్మెల్యేలంతా దండుకుంటున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు ఉందన్నారు. కాంగ్రెస్?ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణలో వచ్చేది బీజేపీ సర్కారేనని బండి సంజయ్?అన్నారు. 'బీఆర్ఎస్?, కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చినం, ఈసారి బీజేపీని గెలిపించుకుందాం' అని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. అసలు బీఆర్ఎస్‌ను ఎదుర్కొన్నది బీజేపీనే అని, వారి కుటుంబ అవినీతిని బట్టబయలు చేశామన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన తనపై109 కేసులు పెట్టారని, అయినా భయపడలేదన్నారు. రాష్ట్రంలో ప్రతి స్కీమ్‌కు కేంద్రం నిధులు ఇస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం పేర్లు మార్చి దగా చేస్తోందన్నారు. ఈ విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి ఇప్పటి నుంచే పార్టీ గెలుపు అవకాశాలు పెంచాలని కార్యకర్తలకు సూచించారు. యూపీ ఎన్నికల తర్వాత తెలంగాణపై పార్టీ ఫోకస్ చేస్తుందన్నారు. ఖమ్మం నుంచి ముగ్గురు మంత్రులు అయ్యారని, జిల్లాకు ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. ఒకరు సీఎంకు లెఫ్ట్, ఇంకొకరు రైట్, మరొకరు ఏకంగా సీఎం సీటుపైనే కన్నేశారని ఎద్దేవా చేశారు.

## దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

కేబినెట్ నిర్ణయం ప్రకారం, తెలంగాణలోని ఘట్‌కేసర్-కాజీపేట సెక్షన్‌లో నాలుగో లైను నిర్మాణానికి ఆమోదం లభించింది. 110 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ. 2,419 కోట్లు అవుతుందని అంచనా ఉంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగే అరక్కోణం-రేణిగుంట మార్గంలో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల పూర్తితో ఆయా మార్గాల్లో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 10,021 కోట్లుగా కేంద్రం పేర్కొంది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రాబోతున్నాయి. కొత్త లైన్ల నిర్మాణం ద్వారా రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగడమే కాకుండా, సరుకు రవాణా, ప్రయాణికుల రైళ్ల వేగం కూడా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిని 2029-30 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక వేసింది.

## చంద్రబాబు అరెస్ట్ సమయంలో కొండంత బలమిచ్చారు

శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. గ్లోబల్ ఎన్నారై టీడీపీ అధ్యక్షుడిగా డాక్టర్ పి. గురురాజా బాధ్యతలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడుతూ.. "ప్రపంచంలో తెలుగువారు లేని దేశం లేదు. ఏ దేశానికి వెళ్లినా కనీసం 20 మంది తెలుగువాళ్లు మనకు కనిపిస్తారు. తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక స్వర్గీయ ఎన్టీఆర్. ఆయన రాజకీయాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చి, చదువుకున్న వారికి, మేధావులకు అవకాశాలు కల్పించారు. ఆయన ఆశయాలను చంద్రబాబు ముందుకు తీసుకెళ్తున్నారు. 2024 ఎన్నికల్లో 50 శాతం స్థానాల్లో యువత గెలుపొందగా, ఏడుగురు ఎన్నారైలకు టీడీపీ అవకాశం కల్పించింది. వారిలో పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి కావడం మనందరికీ గర్వకారణం" అని వివరించారు.గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. "మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేయాలని చూశారు. ఆనాడు అమరావతి ఉద్యమానికి ఎన్నారైలు అండగా నిలిచారు. వారిపై అక్రమ కేసులు పెట్టినా భయపడలేదు. చంద్రబాబు గారిని అక్రమంగా అరెస్ట్ చేసినప్పుడు 50 దేశాల్లోని 200 నగరాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించి తమ గళాన్ని వినిపించారు. ఆ సమయంలో 'మనకు ఈ రాజకీయాలు అవసరమా' అని నా భార్య బ్రహ్మణి నన్ను ప్రశ్నించింది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మీరు నిర్వహించిన 'ఐయామ్ విత్ సీబీఎన్' కార్యక్రమం మా కుటుంబానికి కొండంత బలాన్నిచ్చింది. మళ్లీ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పాన్ని బలపరిచింది. ఎంతోమంది ఎన్నారైలు వేల డాలర్లు ఖర్చుపెట్టుకుని ఓటు వేయడానికి రాష్ట్రానికి వచ్చారు. ఉద్యోగాలకు సెలవులు పెట్టి గ్రామాల్లో తిరిగి ప్రజలను చైతన్యపరిచారు. మీ కృషితోనే ఈ రోజు ప్రజా ప్రభుత్వం ఏర్పడింది" అని లోకేశ్ భావోద్వేగంగా ప్రసంగించారు.

ఎన్నారైలు అంటే 'మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్' అని అభివర్ణించిన లోకేశ్, వారు మంచి ఉద్యోగాలు చేస్తున్నా నమ్ముకున్న పార్టీ కోసం, తెలుగుజాతి కోసం నిలబడ్డారని ప్రశంసించారు. "విదేశాల్లో ఉంటూ కూడా మీ పిల్లలకు అద్భుతమైన తెలుగు నేర్పిస్తున్నారు.

## ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు.. ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు

తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్ఎస్ సభ్యులను ఈ సెషన్ ముగిసేంత వరకు సస్పెండ్ చేయడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సస్పెన్షన్ కు గురైన తర్వాత మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వేసిన వేటు కాదని, తెలంగాణ ప్రజల సమస్యలపై విధించిన సస్పెన్షన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం, మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ఘటనలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే కక్షపూరితంగా సస్పెండ్ చేశారని మండిపడ్డారు. "ప్రజలేమో 'మా సమస్యలపై మాట్లాడండి' అని అడుగుతుంటే... రేవంత్ రెడ్డి మాత్రం 'సభ నుంచి బీఆర్ఎస్‌ను బయటకు తోసేయండి' అని మార్షల్స్‌ను ఆదేశిస్తున్నారు" అని హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నామనే భయంతోనే ప్రతిపక్షం గొంతు నొక్కే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. నియంతృత్వం ఎంత పెరిగితే.. ప్రజా తిరుగుబాటు అంత బలపడుతుంది అన్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలి అని ఆయన హెచ్చరించారు.

# మైలపడ్డది నేలకాదు.. మీ మనస్సు

మొదటి పేజీ తరువాయి

అవమానించే విధంగా ప్రవర్తిస్తున్నారు. ఏ దళితుడైతే కష్టపడి, దుక్కి దున్ని సమాజానికి బుక్కెడు బువ్వ పెడుతున్నాడో.. ఆ దళితుడు దుక్కి దున్నకపోతే ఆకలితో అలమటించి అనాథలుగా చచ్చిపోయే పరిస్థితి ఉండేది. అలాంటి దళితుడు నడిచిన నేలను శుద్ధి చేస్తున్నామని అంటున్నారంటే.. వీళ్ల మనసుల్లో ఎంత కుళ్లు, కుతంత్రాలు, అహంకారం పేరుకుపోయాయో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ శుద్ధి చేయాల్సింది దళిత సోదరులు నడిచిన నేలను కాదు.. కేసీఆర్, ఆయన కుటుంబం మనస్సుల్లో ఇంకా మిగిలిపోయిన అంటరానితనపు ఆలోచనలను శుద్ధి చేయాలి. ఈ నేలను నీళ్లతో కడిగితే శుద్ధి అవుతుందేమో కానీ.. తరతరాలుగా వీళ్ల మనస్సుల్లో పేరుకుపోయిన రాచరికపు అహంకారాన్ని, అంటరానితనాన్ని ఏ నీళ్లతో శుద్ధి చేయాలి అధ్యక్షా? వీళ్ల మనస్సుల్లో గడ్డకట్టుకుపోయిన ఈ కుళ్లును, వివక్షను నీళ్లతో కడిగితే పోదు.. యాసిడ్ పోసి శుద్ధి చేయాల్సిన అవసరం ఉంది" అని వ్యాఖ్యానించారు.

**దళిత సోదరులు ఎక్కడా హింసకు పాల్పడలే**

దళితులకు డప్పు అనేది కేవలం ఒక వాయిద్యం మాత్రమే కాదని, అది వారి జీవితాల్లో ఒక భాగమని, సంతోషం, దుఃఖం, నిరసనను వ్యక్తం చేసే ఆత్మగౌరవ ప్రతీక అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఫామ్‌హౌస్‌కు 2 కిలోమీటర్ల దూరంలోనే పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని అడ్డుకున్నారని, వందలాది మంది పోలీసులు పహారా కాశారని తెలిపారు. దళిత సోదరులు ఎక్కడా హింసకు పాల్పడలేదని, శాంతియుతంగా దండోరా వేసి తమ ఆవేదనను తెలియజేశారని స్పష్టం చేశారు. పదేండ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్.. నిరసనకారుల బాధను అర్థం చేసుకొని, వారి ప్రతినిధులను లోపలికి పిలిపించి మాట్లాడాల్సింది పోయి, మరింత అహంకారంతో వ్యవహరించారని సీఎం రేవంత్ తప్పుబట్టారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నత గౌరవం కలిగిన సభాపతి స్థానాన్ని, ఆ కుర్చీలో కూర్చున్న దళిత బిడ్డను, ఆయనకు జన్మనిచ్చిన తల్లిని అత్యంత నీచమైన పదజాలంతో దూషించడం సభ్య సమాజం తలదించుకునే చర్య అని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిని కించపరచడం యావత్ తెలంగాణ సమాజానికి జరిగిన అవమానమని పేర్కొన్నారు. ఈ దారుణ చర్యలకు పాల్పడినవారితోపాటు వెనకుండి నడిపించిన సూత్రధారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం వెనుక అణగారిన వర్గాల విముక్తి, సమానత్వం అనే ఉన్నతమైన ఆశయాలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. దాదాపు 140 ఏండ్ల క్రితం దోపిడీ, అణచివేతకు గురైన కోట్లాది భారతీయులకు విముక్తి కలిగించేందుకు త్రివర్ణ పతాకం అండగా నిలిచిందని వివరించారు. స్వాతంత్ర్యానంతరం మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మార్గదర్శకత్వంలో, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సారథ్యంలో రాజ్యాంగ రచన జరిగిందని గుర్తు చేశారు. అణగారిన జాతులకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించి.. వారి ఆత్మగౌరవాన్ని కాపాడిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని చెప్పారు. భారతదేశంతోపాటే స్వాతంత్ర్యం పొందిన పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లాంటి దేశాలు ఆర్థిక సంక్షోభాలు, రాజకీయ అస్థిరతతో కుదేలవుతుంటే, ప్రపంచ దేశాలతో భారత్ దీటుగా నిలబడటానికి అంబేద్కర్ రాసిన బలమైన రాజ్యాంగమే కారణమని సీఎం స్పష్టం చేశారు. రాజ్యాంగ రక్షణ, దళిత, గిరిజన, బహుజనుల హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉంటుందని తెలిపారు. హైదరాబాద్ రాష్ట్రంలో పుట్టి, నేటి కర్నాటక పరిధిలోని మారుమూల గ్రామం నుంచి ఎదిగిన దళిత నేత, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జీవితాన్ని సీఎం సభలో ప్రస్తావించారు. రజాకార్ల దాడిలో తల్లిని కోల్పోయి, తండ్రి సంరక్షణలో పెరిగిన ఖర్గే.. సాధారణ కార్మిక నాయకుడి స్థాయి నుంచి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా, పార్లమెంట్ సభ్యుడిగా సుదీర్ఘ ప్రజాసేవ చేశారని కొనియాడారు. 85 ఏండ్ల వయసులో కూడా ఆయన ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఇటీవల ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ మైదానంలో ఖర్గే పాల్గొన్న బహిరంగ సభ ముగిసిన తర్వాత, బీజేపీ అనుబంధ శ్రీరామసేన సభ్యులు ఆ ప్రాంగణాన్ని శుద్ధి చేయడం సిగ్గుచేటని సీఎం మండిపడ్డారు. దళిత నాయకుడు అడుగుపెట్టిన నేలను శుద్ధి చేయడాన్ని తెలంగాణ సమాజం ముక్తకంఠంతో ఖండించిందని, ఢిల్లీలోని ఇందిరా భవన్ సమావేశం అనంతరం రాష్ట్రపతిని కలిసి దీనిపై తమ ఎంపీలు ఫిర్యాదు చేశారని రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## స్థానిక ఎన్నికల్లో మనం గట్టిగా నిలబడాలి..

మొదటి పేజీ తరువాయి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బలంగా నిలబడాలని, పోరాడాలని పార్టీ శ్రేణు□లకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికలు నిజాయితీగా జరిగితే విజయం తప్పకుండా వైఎస్సార్‌సీపీదే అని స్పష్టం చేశారు. పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన్‌రెడ్డి, పలువురు నేతలు సమావేశానికి హాజరయ్యారు.

**కార్యకర్తలు గర్వపడేలా మన పాలన**

మన 5 ఏళ్ల పాలన, బాబు రెండున్నర ఏళ్ల పాలనలో ఎంతో తేడా ఉంది. దీనిపైనే ప్రతి ఇంట్లో చర్చ జరుగుతోంది. ఆ ఐదేళ్ల మన పరిపాలనలో ప్రతి కార్యకర్త కాలర్ ఎగరేసుకుని ఫలానావాడు మా నాయకుడు, ఫలానా పార్టీ మా పార్టీ అని గర్వంగా చెప్పుకోగలిగే పరిస్థితి. మ్యానిఫెస్టోకు అర్థం తీసుకొచ్చిన పార్టీ రాష్ట్ర చరిత్రలో కానీ, దేశ చరిత్రలో కానీ ఏదైనా ఉందంటే అది ఒక్క వైఎస్సార్‌సీపీ మాత్రమే. రాజకీయ నాయకులు, పార్టీలు ఎన్నికలప్పుడు మేనిఫెస్టోలు ఇస్తారు. చంద్రబాబు లాంటి వాళ్లు అయితే ఏకంగా ప్రతి ఇంటికి బాండ్లు కూడా పంచిపెడతారు. ఎన్నికలు అయిపోయిన తర్వాత ఆ మ్యానిఫెస్టో, అందులో ఇచ్చిన హామీలు చెత్తబుట్టలో కనిపిస్తాయి. అలాంటి పరిస్థితిని మార్చిన పాలన మనది. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావి స్తూ, అందులో చెప్పిన వాటిలో 99 శాతం అమలు చేసిన పార్టీ వైఎస్సార్‌సీపీ మాత్రమే అని గర్వంగా చెప్ప గలుగుతాం. అంతగా మాట ఇస్తె ఆ మాటపై నిలబడాలి అని తాపత్రయపడ్డాం. బడ్జెట్ ప్రవేశపెట్టేటప్పుడే ఏ పథకం ఏ నెలలో ఎప్పుడు ఇస్తాము అని ముందుగానే షెడ్యూల్ ప్రకటించి, ఒక్క పథకం కూడా మిస్ కాకుండా బటన్లు నొక్కి అమలు చేసిన పార్టీ వైఎస్సార్‌సీపీ మాత్రమే. గతంలో ఎప్పుడూ చూడని విధంగా వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చాం. ప్రభుత్వ లంచాలు లేకుండా ఇవ్వగలిగే పరిస్థితి ఉంటుందా? అన్న సందేహాలను పటాపంచలు చేశాం. ప్రతి గ్రామంలో ఒక సచివాలయం ఏర్పాటు చేసి, ప్రతి 50, 60 ఇళ్లకు ఒక వలంటీర్‌ను తీసుకొచ్చి, ప్రతి పథకాన్ని పారదర్శకంగా అమలు చేశాం. ఇది వైఎస్సార్‌సీపీ హయాంలోనే జరిగింది. మన ప్రభుత్వ హయాంలో గవర్నమెంట్ స్కూళ్లు, ప్రైవేటు స్కూళ్లకు పోటీగా మారాయి. ఇంగ్లీష్ మీడియం చదువులు, మూడో తరగతి నుంచి టోఫెల్ పీరియడ్, సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్ అమలు చేయడం, నాడు--నేడు మనబడితో ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు పూర్తిగా మార్చడం, ఆరో తరగతి నుంచి ప్రతి క్లాస్ రూమ్‌లోనూ డిజిటలైజ్డ్ బోధన తీసుకొచ్చేలా డిజిటలైజ్డ్ క్లాస్ రూమ్స్ చేయడం వైఎస్సార్‌సీపీ హయాంలోనే జరిగాయి. గోరుముద్ద అనే పేరుతో పిల్లలు ఏం తింటున్నారో, తినే ఆ తిండి బాగుందా లేదా అని పట్టించుకునే ముఖ్యమంత్రి బహుశా దేశ చరిత్రలో ఎవరైనా ఉంటారో లేదో తెలియదు కానీ జరిగింది ఒక వైఎస్సార్‌సీపీ ప్రభు□త్వ హయాంలోనే. మొట్టమొదటిసారిగా బైలింగ్వల్ టెక్ట్స్‌బుక్స్.. ఒక పేజీ తెలుగు, ఒక పేజీ ఇంగ్లీషుతో బుక్స్ ప్రవేశపెట్టిన ప్రభుత్వం మనది. ఎనిమిదో తరగతికి పిల్లాడు వచ్చేసరికి ఆ పిల్లాడి చేతుల్లో ట్యాబ్‌లు పెట్టింది కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే.

## ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర..

అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్, ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజాస్వామ్యవాదులు భావించారని అన్నారు. కానీ కేసీఆర్ అలా చేయలేదని విమర్శించారు. ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్యలు చర్చకు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతోనే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపించారని మండిపడ్డారు. ఎక్కడైతే ఈ కుట్రకు తెరలేచిందని ఆరోపించారో.. అదే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి డప్పులు వాయించేందుకు ప్రయత్నిస్తే అక్కడ శుద్ధీకరణ చేశారని రేవంత్ అన్నారు. ఉత్తరాఖండ్‌లో ఖర్గే నిరసనలో పాల్గొన్న మైదానాన్ని శ్రీరామసేన శుద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు.

## సొంత మహిళా ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ నేతలే తోసేశారు

సీతక్క విడుదల చేసినవి మార్ఫింగ్ ఫొటోలంటూ బీఆర్ఎస్ ఎదురుదాడి


తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల్లో బుధవారం మరో కీలక మలుపు చోటుచేసుకుంది. సొంత పార్టీకి చెందిన కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ తోటి మహిళా సభ్యుల పట్ల అమర్యాదగా ప్రవర్తించారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలను కూడా ఆమె మీడియాకు విడుదల చేశారు. మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిలను వారి పార్టీకే చెందిన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి వెనుక నుంచి నెట్టేశారని సీతక్క ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలను పక్కకు తోసేసి గంగుల కమలాకర్ ముందుకు వెళ్లడం సిగ్గుచేటని ఆమె వ్యాఖ్యానించారు.

# ప్రతి వారం ప్రజల మధ్యనే ఉంటా

ప్రతి వారం ప్రజల వద్దకే వస్తున్నానని, వారి బాగోగులు తెలుసుకుంటూ పాలన సాగిస్తున్నానని తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన పేదల వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందిస్తూ వారి కష్టసుఖాలను తెలుసుకుంటున్నానని సీఎం గుర్తుచేశారు. అలాగే, ప్రతి నెలా మూడో శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో, నాలుగో శనివారం పీ4 (ప్రజలు, ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యం) కార్యక్రమంలో పాల్గొంటూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరిగితేనే సంపద సృష్టి జరుగుతుందని, తద్వారా ప్రజలంతా గౌరవంగా జీవించేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

**భూమికి భద్రత.. గత ప్రభుత్వ పాపాల ప్రక్షాళన**

ప్రతి నెలా 9వ తేదీన 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమం ద్వారా రైతులకు, యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని సీఎం తెలిపారు. భూమిపై యజమానులకు తిరుగులేని హక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత పాలకులు తమ ఐదేళ్ల పాలనలో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేశారని, రికార్డులను తారుమారు చేసి ఘోరాలు, నేరాలు, పాపాలు చేశారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ల్యాండ్



టైటిలింగ్ యాక్ట్ పేరుతో ప్రజల భూములను కాజేసేందుకు కుట్ర పన్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ప్రమాదకర చట్టాన్ని రద్దు చేసి ప్రజలకు భరోసా ఇచ్చిందని గుర్తుచేశారు. "రీసర్వే పేరుతో గత ప్రభుత్వం చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములపై కూడా తమ ఫొటోలు వేసుకున్నారు. సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకునే పిచ్చి ఏమిటో ఎవరికీ అర్థం కాలేదు. తమకు ఇష్టం లేని వ్యక్తుల భూములను, ఆస్తులను 22ఏ జాబితాలో చేర్చి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. అందుకే ఇప్పుడు పటిష్ఠమైన రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి, ఎక్కడా అవకతవకలకు తావులేకుండా బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, ఈ-కేవైసీ, క్యూఆర్ కోడ్ వంటి భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నాం"అని చంద్రబాబు వివరించారు. భూమికి సంపూర్ణ భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ అజెండా అని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,234 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి, 36 లక్షల మందికి రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు అందించామని తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన 8,582 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి మొత్తం 56 లక్షల పాస్ పుస్తకాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆటో మ్యూటేషన్ సేవలు అందుబాటులోకి తెచ్చామని, వారసత్వ భూముల విభజనలో స్టాంప్ డ్యూటీని కేవలం రూ.1000కి పరిమితం చేయడం ద్వారా 1.25 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చామని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి లక్షలాది మందికి ఊరట కల్పించామని అన్నారు. శెట్టిపల్లి కంగుంది, వట్టిచెరుకూరు, ముదినేపల్లి వంటి ప్రాంతాల్లో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న 244 కీలక భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించామని తెలిపారు.



# కొంగర కలాన్‌లో జిల్లా కిసాన్ మేళా

- ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలి
- ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: వ్యవసాయ నిపుణులు



**తొలివెలుగు, కొంగరకలాన్:** రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతికత, వ్యవసాయ యంత్ర పరికరాల వినియోగంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కొంగర కలాన్‌లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కిసాన్ మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముదిరెడ్డి కోదండరెడ్డితో పాటు జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుజాత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కిసాన్ మేళాను, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను వారు ప్రారంభించారు. అనంతరం సమావేశ మందిరంలో ప్రముఖ సాహిత్యవేత్త పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ నిపుణులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికత, నూతన సాగు పద్ధతులు, పంటల దిగుబడి పెంపు తదితర అంశాలపై చర్చించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. కిసాన్ మేళాలో ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ స్టాల్స్ రైతులకు ఆకట్టుకున్నాయి. స్టాల్స్ ద్వారా ఆధునిక సాగు విధానాలు, వ్యవసాయ యంత్ర పరికరాల వినియోగం, పంటల నిర్వహణ, అధిక దిగుబడుల సాధన తదితర అంశాలపై రైతులకు నిపుణులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ నిపుణులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే విద్యార్థుల శారీరక, మానసిక వికాసం

- వలిగొండలో ఘనంగా మండల స్థాయి క్రీడోత్సవాలు-2026
- ప్రారంభించిన ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి

**తొలివెలుగు, వలిగొండ :** క్రీడలు విద్యార్థుల్లో శారీరక, మానసిక వికాసానికి



ఎంతగానో దోహదపడతాయని ఎంపీడీవో జి. జలంధర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈవో సుంకోజు భాస్కర్ ఆధ్వర్యంలో బుధవారం మండల స్థాయి క్రీడోత్సవాలు అత్యంత ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలను ఎంపీడీవో ప్రారంభించి మాట్లాడారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో విజయాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ నిరంతర సాధనతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంభం వెంకటపాపిరెడ్డి, ఉప సర్పంచ్ మలుగ మాధవి, ఏపీపీసీ చైర్మన్ విజయలక్ష్మి, ట్రాస్మా జిల్లా అధ్యక్షుడు పాలకుర్ల వెంకటేశం గౌడ్, జీహెచ్‌ఎంలు నరేష్, శ్రీకృష్ణ ప్రసాద్, కనకదుర్గ, ఏసీఎఫ్ జి. చండిదాస్, టీజీపీఈటీఏ జిల్లా అధ్యక్షుడు మల్లేశం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ పబ్బు సురేందర్ గౌడ్, ఏడీఈ మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.



# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు కాంగ్రెస్ నిరసన






- తాతా మధును సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- పెద్ద అంబర్‌పేట్-కుంట్లూర్ చౌరస్తాలో చావు డప్పుతో నిరసన

**తొలివెలుగు, హయత్‌నగర్:** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కాంగ్రెస్ రాష్ట్ర దళిత విభాగం పిలుపు మేరకు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాలతో మాజీ కౌన్సిలర్ గ్యారాల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం పెద్ద అంబర్‌పేట్-కుంట్లూర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు చావు డప్పు కొట్టి బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శాసనసభ స్పీకర్ పదవికి రాజకీయాలకు అతీతంగా గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నాయకులు పేర్కొన్నారు. స్పీకర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. బాటసింగారం సొసైటీ బ్యాంక్ చైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బి-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కర్‌చారి మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన శాసనసభ పీఠం గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. దళిత నాయకత్వాన్ని కించపరిచేలా మాట్లాడటం తగదని పేర్కొన్నారు. అధికారం కోల్పోయామనే అక్కసుతోనే బీఆర్ఎస్ నాయకులు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను రాజకీయాలకు అతీతంగా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. తాతా మధుపై వెంటనే చర్యలు తీసుకుని, ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధిష్ఠానం ఈ వ్యవహారంపై స్పందించి క్షమాపణ చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద అంబర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు పందుగల రాజు, కుంట్లూర్ డివిజన్ అధ్యక్షుడు భీమగోని భాస్కర్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ సిద్ధంకి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు రాజ్‌కుమార్, పాలడుగు నాగార్జున, సీనియర్ నాయకులు ఎరుకల భాస్కర్‌గౌడ్, సుప్రసన్నారెడ్డి, చేగురు వెంకటేష్, రాజేంద్రప్రసాద్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 'సేవా సంకల్ప అభియాన్'ను జయప్రదం చేయాలి





- సెప్టెంబరు 17 నుంచి 9 ప్రధాన సేవా కార్యక్రమాలు
- ప్రజలను భాగస్వామ్యం చేస్తూ విస్తృతంగా నిర్వహించాలి
- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**తొలివెలుగు, నాగోల్:** తెలంగాణ రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు సెప్టెంబరు 17 నుంచి నిర్వహించనున్న 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు నాయకులు దిశానిర్దేశం చేశారు. జీఎస్ఐ డివిజన్ పరిధిలో బీజేపీ ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్ వర్క్‌షాప్‌ను డివిజన్ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కన్వీనర్ యశ్పాల్‌గౌడ్, నాగోల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సెప్టెంబరు 17 నుంచి చేపట్టనున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా నిర్వహించాల్సిన తొమ్మిది ప్రధాన కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల నిర్వహణకు ఇన్‌చార్జిల వారీగా బాధ్యతలను కేటాయించారు. సేవా కార్యక్రమాల నిర్వహణ విధానం, ప్రజలను భాగస్వామ్యం చేయడం, ప్రచారం, సమన్వయం తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. సమాజంలోని వివిధ వర్గాలకు ప్రయోజనం చేకూరేలా సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి, ప్రజల్లో సేవా భావాన్ని మరింత పెంపొందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో నాగోల్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్, సీనియర్ నాయకులు సిద్ధాల ఐలయ్య, సంజీవరెడ్డి, సర్వీరాజు, శ్యాంకుమార్, నరేందర్‌రెడ్డి, బద్దం బాలకృష్ణగౌడ్, గోపాల్‌శర్మ, యాదగిరి, మునేందర్, చాడ అనితారెడ్డి, దయాకర్‌రెడ్డి, మమత, సాయికుమారి, శ్రీనివాస్‌రెడ్డి, కొండబత్తుల శ్రీనివాస్, ఉమా, కృష్ణమూర్తి, బీజేవైఎం అధ్యక్షుడు వినోద్‌యాదవ్, నరేష్‌యాదవ్, రమణ్ తదితరులు పాల్గొన్నారు.

# తాతా మధు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలి

- దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు దారుణం
- చిన్నగూడూరులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో తీవ్ర నిరసన
- మండలాధ్యక్షుడు మారబోయిన వెంకటేశ్వర్లు డిమాండ్

**తొలివెలుగు, చిన్నగూడూరు :** శాసనసభ దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధు తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ చిన్నగూడూరు మండల అధ్యక్షుడు మారబోయిన వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలోని దాశరథి సెంటర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మారబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పీఠాన్ని, దళిత సామాజిక వర్గాన్ని అవమానించేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. తాతా మధు తన వ్యాఖ్యలకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గూనిగంటి కమలాకర్, మాజీ జడ్పీటీసీ మూల సునీత మురళీధర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి సుధాగాని నాగేష్, ఉపాధ్యక్షులు బిక్కునాయక్, రవి, కిరణ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు రావుల రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి వల్లూరి కృష్ణారెడ్డి, సర్పంచులు రమేష్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, జిల్లా, మండల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు, బూత్ లెవల్ ఏజెంట్లు, సోషల్ మీడియా అధ్యక్షుడు జనక శేఖర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# స్లేట్ ది స్కూల్‌లో 'తెలంగాణ భాషా దినోత్సవం'

- ఆకట్టుకున్న బుర్రకథ, హరికథ ప్రదర్శనలు
- ఘనంగా సాంస్కృతిక వేడుకలు




**తొలివెలుగు, కర్మన్‌ఘాట్ :** తెలంగాణ భాషా వైభవాన్ని, సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో కర్మన్‌ఘాట్‌లోని స్లేట్ ది స్కూల్లో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.దచిన్నారులు బుర్రకథ, హరికథ, నాటికలు, పద్యాలు, కీర్తనలు తదితర సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించి తెలంగాణ సాహిత్యం, జానపద వైభవాన్ని కళ్లకు కట్టారు. విద్యార్థుల ప్రతిభను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కొనియాడారు. చిన్నారుల్లో సొంత భాష, సంస్కృతిపై ఆసక్తిని పెంపొందించేందుకు ఇటువంటి వేడుకలు ఎంతగానో దోహదపడతాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. వేడుకలతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

- ఎన్‌హెచ్-65 ఇనాంగూడ బ్రిడ్జి వద్ద ప్రమాదం
- మృతుడు వలిగొండ మండలం వేలువర్తి వాసి

**తొలివెలుగు, అబ్దుల్లాపూర్‌మెట్ :** గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేలువర్తి గ్రామానికి చెందిన మారబోయిన వినయ్ (25) విద్యార్థిగా ఉంటున్నాడు. బుధవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో వినయ్ తన ప్యాషన్ ప్రో ద్విచక్ర వాహనం (ఎంహెచ్ 01 టీజెడ్ 8374)పై అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి బాటసింగారం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇనాంగూడ బ్రిడ్జి వద్ద ఎన్ఎచ్-65పైకి చేరుకోగా, వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఇతని బైక్‌ను బలంగా ఢీకొట్టి ఆగకుండా వెళ్ళిపోయింది. ఈ ప్రమాదంలో వినయ్ తలకు తీవ్ర గాయాలై అధిక రక్తస్రావం కావడం వల్ల ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## రాహుల్‌కు ఇటాలియన్‌లో లేఖ.. ఫీజు బకాయిలపై బీజేపీ చీఫ్ వినూత్న నిరసన

- రాహుల్ గాంధీకి ఇటాలియన్ భాషలో లేఖ రాసిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై వినూత్నంగా నిరసన
- రూ.15 వేల కోట్ల బకాయిలతో 40 లక్షల మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆరోపణ
- విద్యార్థులకు మద్దతిస్తే ప్రభుత్వం అరెస్టులు చేస్తోందని విమర్శ
- కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ హామీలను నెరవేర్చలేదని విమర్శలు

**తొలివెలుగు:** తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టిని ఆకర్షించేందుకు బీజేపీ సీనియర్ నాయకులు ఎన్. రామచందర్ రావు వినూత్న నిరసన చేపట్టారు. బుధవారం ఆయన రాహుల్ గాంధీకి ఇటాలియన్ భాషలో లేఖ రాశారు. రాష్ట్రంలో సాగుతున్న ఆందోళనలు, విద్యార్థుల నిరసనలు, పోలీసుల లాఠీఛార్జులు, అరెస్టులు వంటివేవీ రాహుల్ గాంధీని గానీ, తెలంగాణ ప్రభుత్వాన్ని గానీ కదిలించలేకపోయాయని, అందుకే ఆయన "మాతృభాష" అయిన ఇటాలియన్‌లో లేఖ రాస్తున్నట్లు రామచందర్ రావు ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ఫలితంగా విద్యార్థులు ఉన్నత చదువులకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కొరతతో విద్యాసంస్థల యాజమాన్యాలు, అధ్యాపకులు, సిబ్బంది కూడా అరకొర వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై విద్యార్థులకు మద్దతుగా నిలిస్తే రాష్ట్ర ప్రభుత్వం అరెస్టులు, పోలీసు చర్యలతో అణచివేస్తోందని రామచందర్ రావు విమర్శించారు. సమస్య పరిష్కారం కోసం గళమెత్తినందుకు గత 10 రోజుల్లోనే తనను నాలుగుసార్లు అరెస్టు చేశారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'యూత్ డిక్లరేషన్'లో ఇచ్చిన నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ, విద్యా భరోసా కార్డుల వంటి హామీలను నెరవేర్చలేదని ఆయన దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి బకాయిలన్నీ విడుదల చేయించాలని, విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేలా చర్యలు తీసుకోవాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు.

## హైదరాబాద్ హాస్టళ్లకు 'హైడ్రా' స్ట్రిక్ట్ వార్నింగ్.. 3 నెలలే డెడ్‌లైన్!

- హైదరాబాద్‌లో నిబంధనలు పాటించని హాస్టళ్లపై హైడ్రా ఉక్కుపాదం
- ప్రమాదకర భవనాలను ఖాళీ చేసేందుకు 3 నెలల గడువు
- వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ప్రత్యేక తనిఖీలు
- విద్యార్థుల భద్రతతో రాజీపడొద్దని కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం




**తొలివెలుగు, హైదరాబాద్:** నగరంలోని హాస్టళ్ల భద్రతపై హైడ్రా కఠిన నిబంధనలు జారీ చేసింది. సురక్షితం కాని, అనుమతులు లేని భవనాల్లో నడుస్తున్న హాస్టళ్లను మూడు నెలల్లోగా సురక్షితమైన భవనాల్లోకి మార్చాలని నిర్వాహకులకు అల్టిమేటం ఇచ్చింది. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి తనిఖీలు చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రమాదకర భవనాలను కూల్చివేస్తామని స్పష్టం చేసింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధ్యక్షతన హాస్టళ్ల నిర్వాహకులు, భవన యజమానులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హాస్టళ్లలో నివసించే విద్యార్థులు, ఉద్యోగుల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ప్రతి హాస్టల్‌లో అగ్నిమాపక భద్రత, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, నిర్మాణ పటిష్ఠత తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రమాదకర భవనాల్లో హాస్టళ్లు నడిపేవారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల గచ్చిబౌలిలోని అంజయ్య నగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం కూలి ఇద్దరు మరణించడం, ఢిల్లీలో హాస్టల్ భవనం కూలి పలువురు చనిపోవడం వంటి ఘటనల నేపథ్యంలో హైడ్రా ఈ కీలక నిర్ణయాలు తీసుకుంది. అనుమతులు లేని భవనాలపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించేందుకు మూడు మున్సిపల్ కార్పొరేషన్లతో సమన్వయం చేసుకుంటామని రంగనాథ్ తెలిపారు. కేవలం లాభార్జన కోసం భద్రతను విస్మరించవద్దని, హాస్టల్ వాసులను తమ సొంత బిడ్డల్లా భావించి వసతులు కల్పించాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య అగ్నిప్రమాదాలు నివారణ చర్యల, ఫైర్ సేఫ్టీ నిబంధనలపై వీడియోల ద్వారా నిర్వాహకులకు సమగ్ర అవగాహన కల్పించారు.

## తెలంగాణ ఉద్యోగులకు శుభవార్త.. పీఆర్‌సీపై ప్రభుత్వం కీలక అడుగు

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కీలక చర్య చేపట్టింది. 2వ వేతన సవరణ కమిషన్ (పీఆర్‌సీ) నివేదికను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోరారు. ఈ మేరకు రెండో పీఆర్సీ ఛైర్మన్ ఎన్. శివశంకర్‌కు లేఖ రాశారు. గతంలో నియమించిన రెండో వేతన సవరణ కమిషన్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పీఆర్‌సీ అమలుపై ఉద్యోగ సంఘాల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. బకాయి ఉన్న డీఏలు విడుదల చేయాలని, పీఆర్‌సీ నివేదిక ఆధారంగా ఫిట్‌మెంట్ ప్రకటించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశాలపై ఉద్యోగులు ఆందోళన బాట పట్టడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది.

# కాంగ్రెస్ కుటిల రాజకీయం.. ఎమ్మెల్సీ అనని మాటలు అన్నట్టుగా చిత్రీకరణ

**తొలివెలుగు, హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, ప్రజా సమస్యలు, శాసనసభలో చోటుచేసుకున్న పరిణామాలు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై పోలీసుల చర్యలు, కేసీఆర్ నివాసంపై దాడి వంటి అంశాలను గవర్నర్ శివప్రతాప్ శుక్లా దృష్టికి తీసుకెళ్లినట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు వెల్లడించారు. శాసనసభా వ్యవహారాలతోపాటు బయట జరిగిన ఘటనలపైనా విచారణ జరిపిస్తామని గవర్నర్ తమకు హామీ ఇచ్చారని, రాష్ట్రంలో జరుగుతున్న దౌర్జన్యకాండలో ఆయన జోక్యం చేసుకుంటారని ఆశిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో న్యాయం జరుగకపోతే జాతీయ స్థాయి సంస్థలను ఆశ్రయిస్తామని తేల్చి చెప్పారు. హైదరాబాద్ లోక్‌భవన్‌లో బుధవారం గవర్నర్ శివప్రతాప్ శుక్లాను పార్టీ ప్రతినిధులతో కలిసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శాసనసభ వ్యవహారాలతోపాటు సభ వెలుపల జరిగిన ప్రతి ఘటనను, కేసీఆర్ ఇంటిపై దాడి వంటి అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయనను కోరారు. అనంతరం లోక్‌భవన్ బయట మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ.. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు తాము గవర్నర్‌ను కలిశామని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను గవర్నర్‌కు వివరించామని, ప్రతి అంశంపైనా విచారణ జరిపిస్తామని ఆయన హామీ ఇచ్చారని చెప్పారు.కొత్త చట్టాలను పరిశీలించండి

### 1,000 రోజుల పాలన విఫలం

'కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు, 420 హామీలను 100 రోజుల్లోనే అమలు చేస్తామని అధికారంలోకి వచ్చింది. 1,000 రోజులైనా వాటిని అమలుచేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దీనిపై గవర్నర్‌కు సమగ్రంగా వివరించాం' అని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా రైతులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎదురొంటున్న సమస్యలను వివరించామని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరుపై తమ వాదనను ఆయన ముందుంచామని చెప్పారు. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన, వారి డిమాండ్లను వివరిస్తూ, వారి ఆందోళనను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న ప్రతిపక్షంపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతోపాటు, క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను కూడా



గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు. 'దళిత స్పీకర్' పేరిట కాంగ్రెస్ రాజకీయాలు చేస్తున్నది. శాసనమండలి సభ్యులు అనని మాటలను అన్నట్టుగా మానిప్యులేషన్ చేస్తున్నారు. కేసీఆర్ ఇంటిపై దాడి, ఆయనపై హత్యాయత్నానికి ప్రభుత్వం కుట్ర చేసింది. ఈ వ్యవహారం వెనుక ముమ్మాటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హస్తం ఉన్నది.

### పోలీసుల అడ్డంకులపై ఫిర్యాదు

శాసనసభ సమావేశాల తొలిరోజు జరిగిన పరిణామాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్టు కేటీఆర్ వివరించారు. రాహుల్‌గాంధీ పార్లమెంటులో నిరసన తెలిపిన తరహాలోనే తాము కూడా టీషర్టులు ధరించి నిరసన వ్యక్తంచేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. శాసనసభ్యులుగా తమకున్న హకులను కాలరాస్తూ, సభలోకి వెళ్లనీయకుండా పోలీసులు రోడ్డుపైనే అడ్డుకున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో పోలీసులు తమపై దాష్టీకానికి పాల్పడ్డారని గవర్నర్‌కు వివరించినట్టు చెప్పారు. తమపై జరిగిన దాడికి సంబంధించిన ఫొటోలు, ఇతర ఆధారాలను గవర్నర్‌కు అందజేశామని తెలిపారు. మహిళా శాసనసభ్యులపై జరిగిన పోలీసుల దుశ్చర్యను ప్రత్యేకంగా వివరించినట్టు చెప్పారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను లాగారని, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసుల వ్యవహారశైలిపై చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు. తమపై దాడి చేసిన తర్వాత తిరిగి తమపైనే నిందలు మోపే ప్రయత్నం జరుగుతున్నదని వివరించినట్టు చెప్పారు. పోలీసుల చర్యలకు సంబంధించిన పూర్తి వివరాలు, ఆధారాలను గవర్నర్ ముందుంచామని తెలిపారు. హైకోర్టు సూచనలు ఉన్నప్పటికీ తమను సభల్లోకి రానివ్వకుండా ప్రభుత్వం వ్యవహరించిందని చెప్పారు. ఈ పరిణామాల ద్వారా ప్రభుత్వానికి రాజ్యాంగం, న్యాయస్థానాలపై గౌరవం లేదనే విషయం స్పష్టమవుతున్నదని వివరించినట్టు తెలిపారు.ఎన్నికల ప్రచారం చూడండి

### స్పీకర్ పేరిట రాజకీయం?

బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసిన అంశాన్ని కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని కేటీఆర్ చెప్పారు. శాసనమండలి సభ్యులు అనని మాటలను అన్నట్టుగా ఆపాదిస్తూ, జరుగని అవమానాన్ని జరిగినట్టుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. స్పీకర్‌పై తమకు అపారమైన గౌరవం ఉన్నదని స్పష్టం చేస్తూనే, కాంగ్రెస్ పార్టీయే పదేపదే 'దళిత స్పీకర్' అంటూ ఆయనను రాజకీయ వివాదంలోకి లాగుతున్నదని విమర్శించారు. కేసీఆర్ ఇంటిపై దాడి చేస్తూ హత్యాయత్నానికి ప్రభుత్వం ప్రయత్నించిన తీరును గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ముఖ్యమంత్రి స్వయంగా ఉన్నారని ఆరోపించారు. కేసీఆర్ లాంటి మహానాయకుడి ఇంటి వద్ద చావు డప్పు కొట్టి ఆయన చావును కోరడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు.

## మధు యాష్కీకి జాతీయ పదవి.. ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ఛైర్మన్‌గా నియామకం

తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ మధు గౌడ్ యాష్కీకి జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు లభించాయి. ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) నూతన ఛైర్మన్‌గా ఆయనను కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు ఛైర్మన్‌గా పనిచేసిన ప్రవీణ్ చక్రవర్తి సేవలను పార్టీ ఈ సందర్భంగా ప్రశంసించింది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రచార కమిటీ ఛైర్మన్‌గా కీలక పాత్ర పోషించినప్పటికీ, ఎల్బీ నగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ, కాంగ్రెస్ అధిష్ఠానానికి అత్యంత సన్నిహితుడిగా పేరున్న యాష్కీకి జాతీయ స్థాయిలో పదవి లభించడం గమనార్హం. నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి 2004, 2009లలో వరుసగా రెండుసార్లు ఎంపీగా గెలుపొందిన మధు యాష్కీ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి గట్టి మద్దతుదారుగా నిలిచారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ చీఫ్ విప్‌గా కూడా ఆయన సేవలు అందించారు. అయితే, 2014, 2019 లోక్‌సభ ఎన్నికలతో పాటు, 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆయన ఓటమి చవిచూశారు. తెలంగాణలో



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఖాళీ అయిన టీపీసీసీ అధ్యక్ష పదవికి మధు యాష్కీ పేరు ప్రముఖంగా వినిపించింది.

## ఆ బూతులు భరించలేకనే కడుపు మండి మాట్లాడా!:

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన రాజకీయ దుమారంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. వ్యక్తిగతంగా ఏ ఒక్కరి చావును కోరుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని ఆయన అంగీకరించారు. అయితే, సభలోనూ బయటా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, దళిత వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్



కుమార్‌ను, మహిళా మంత్రులను బీఆర్ఎస్ నేతలు అత్యంత అసభ్యకరంగా, కులాల పేరుతో దూషిస్తూ లక్ష్మణరేఖ దాటుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతల బూతులు వినలేక టీవీలు చూస్తున్న మహిళలు చెవులు మూసుకుంటున్నారని, బీఆర్ఎస్ నేతలు వారి సొంత కుటుంబ సభ్యులు కూడా తలదించుకునేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే అసెంబ్లీకి రాకుండా దూరంగా ఉంటున్న కేసీఆర్ వెంటనే సభకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చలో పాల్గొనాలని కోరే క్రమంలో కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలదని, కేసీఆర్ కుటుంబానికి మాత్రమే సొంతం కాదని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరిని కూడా ఎమ్మెల్యే శంకర్ తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఉద్దేశించి, "ఎక్కడ సచ్చిండు రాహుల్ గాంధీ?" అంటూ మూడు రోజుల క్రితం కరీంనగర్ పర్యటనలో కేటీఆర్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను ఆయన మీడియా సమక్షంలో ప్రదర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలపై అంతటి దిగజారుడు పదజాలాన్ని ఉపయోగించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు తమకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

## తిరుమల పర్యటనలో ఉన్న మల్లారెడ్డిని కూడా సస్పెండ్ చేశారు

- సభలో లేని వారిని కూడా సస్పెండ్ చేశారంటూ తలసాని మండిపాటు
- 22-ఏ వంటి అంశాలపై చర్చ జరగకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపాటు
- స్పీకర్ గడ్డం ప్రసాద్ అంటే తమకు ఎంతో గౌరవం ఉందని వ్యాఖ్య

తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ వేటుపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీని తీవ్రంగా అభాసుపాలు చేస్తోందని, ప్రజా సమస్యలు, కీలకమైన జీవో 97, 22-ఏ వంటి అంశాలపై చర్చ



జరగకుండా తప్పించుకునేందుకే విపక్ష సభ్యులను సస్పెండ్ చేస్తోందని ఆరోపించారు. సభకు రాకుండా తిరుమల పర్యటనలో ఉన్న మల్లారెడ్డితో పాటు, సభలో లేని పద్మారావు గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, కేటీఆర్, గంగుల కమలాకర్ పేర్లను కూడా సస్పెన్షన్ జాబితాలో చేర్చడం శాసనసభా చరిత్రలోనే హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. శాసనసభా వ్యవహారాల మంత్రి చదివిన జాబితా ఒకటైతే, స్పీకర్ ప్రకటించిన పేర్లు మరో విధంగా ఉన్నాయని తప్పుబట్టారు. తెలంగాణ సాధకుడు, మాజీ సీఎం కేసీఆర్ చావును కోరుకుంటూ వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేపై ఎలాంటి సస్పెన్షన్ వేటు వేయకుండా సభలోనే కూర్చోబెట్టుకున్నారని విమర్శించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ అంటే బీఆర్ఎస్‌కు ఎంతో గౌరవం ఉందని, ఆయనపై గౌరవంతోనే నాడు స్పీకర్ ఎన్నికలో అభ్యర్థిని కూడా నిలబెట్టలేదని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ నాయకులు నిత్యం 'దళిత స్పీకర్' అని వర్గీకరిస్తూ ఆయన ఇమేజ్‌ను డ్యామేజ్ చేస్తున్నారని మండిపడ్డారు. ఏఐ ఫేక్ ఫొటోలతో బీఆర్ఎస్ నేతలను నెగెటివ్‌గా వైరల్ చేసే కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రవెల్లి ఫాంహౌస్‌కు వెళుతుంటే తమ నేతలను అరెస్ట్ చేయడం, జవహర్‌నగర్ పీఎస్ పరిధిలో బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడటం ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు నిదర్శనమని తలసాని ధ్వజమెత్తారు.



# సజ్జాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం

-దంత పరీక్షలు నిర్వహించి ఉచిత మందుల పంపిణీ

**తణుకు, సెప్టెంబర్ 8:** ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా సజ్జాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు లయన్ అడ్డగర్ల వెంకటేశ్వరరావు తల్లిదండ్రులు అడ్డగర్ల అమ్మిరాజు, వెంకటరత్నం జ్ఞాపకార్థం భీమవరం విష్ణు డెంటల్ మెడికల్ కాలేజ్ వైద్య బృందం సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. సజ్జాపురం లయన్స్ క్లబ్ చార్టర్ సభ్యుడు లయన్ నడింపల్లి శ్రీరామరాజు శిబిరాన్ని ప్రారంభించారు. తూర్పు విప్పర్రు, ఖండ్రిక, కె. కుముదవల్లి, నారాయణపురం గ్రామాలకు చెందిన ప్రజలకు వైద్య బృందం దంత పరీక్షలు నిర్వహించింది. దంత సమస్యలను గుర్తించి బాధితులకు తగిన వైద్య సలహాలు అందించారు. దంతాల పరిశుభ్రత, నోటి ఆరోగ్య పరిరక్షణపై వైద్యులు అవగాహన కల్పించారు. దంత సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యుల సూచనల మేరకు అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సజ్జాపురం లయన్స్ క్లబ్ కోశాధికారి మానేపల్లి హైమావతి, సభ్యులు బైలా లక్ష్మీనారాయణ, పుట్టా విజయశ్రీ, పుట్టా రామచంద్రరావు, కె. ప్రసాద్, అడ్డగర్ల సూర్యనారాయణ, ఆకేటి కాశీ, గంటా నాగు, నామన బోస్, కె. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. శిబిరం నిర్వహణకు సహకరించిన భీమవరం విష్ణు డెంటల్ మెడికల్ కాలేజ్ వైద్య బృందానికి లయన్స్ క్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు భవిష్యత్తులో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు.

# జపమాల మాత విగ్రహ ప్రతిష్ట



**దెందులూరు :** దెందులూరు ఆర్.సి.యం చర్చిలో విచారణ గురువులు ఫాదర్ కె జాన్ జపమాల మాత విగ్రహ ప్రతిష్ట చేశారు. అనంతరం జరిగిన ప్రత్యేక ప్రార్థనలు ఫాదర్ జి మోజెస్ ఫాదర్ బాల కిరణ్ ఫాదర్ తన కుమార్ ఫాదర్ జి పవన్ కుమార్ ఫాదర్ యెన్ పవన్ కుమార్ ఆర్ సి ఎం ఉపాధ్యాయులు కెనడి జ్వకిన్ ఆర్.సి.యం సంఘ పెద్దలు సంఘస్తులు యువత ఉన్నారు



# ఎన్టీఆర్ భరోసా
# పింఛన్ దరఖాస్తులకు ఇంటి పన్ను, కరెంట్ బిల్లు నిబంధన తొలగించాలి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు

**నిడదవోలు, సెప్టెంబర్ 9:** ఎన్టీఆర్ భరోసా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే వారి నుంచి ఇంటి పన్ను రసీదు, కరెంట్ బిల్లు జత చేయాలనే నిబంధనను వెంటనే తొలగించాలని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చర్చిపేటలోని 7, 8వ వార్డుల సచివాలయం వద్ద ఎన్టీఆర్ భరోసా పింఛన్ దరఖాస్తుదారులతో కలిసి ఆయన మాట్లాడారు. పింఛన్ దరఖాస్తుకు ఆధార్ హిస్టరీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు తదితర పత్రాలను జత చేయాలని ముందుగా అధికారులు సూచించారని తెలిపారు. అయితే, తీరా దరఖాస్తులు సమర్పించే సమయంలో ఇంటి పన్ను రసీదు, కరెంట్ బిల్లు కూడా తప్పనిసరిగా జత చేయాలని, అవి లేకుంటే దరఖాస్తులను స్వీకరించబోమని చెబుతున్నారని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేసినట్లు రాంబాబు తెలిపారు. ముఖ్యంగా అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. సొంత ఇంటి యజమానులను ఇంటి పన్ను రసీదు, కరెంట్ బిల్లు ఇవ్వాలని కోరితే పలువురు యజమానులు అందుకు నిరాకరిస్తున్నారని దరఖాస్తుదారులు తెలిపారు. దీంతో అర్హులైన పేదలు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే విషయంలో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఇంటి పన్ను, కరెంట్ బిల్లు రసీదులు తప్పనిసరిగా జత చేయాలనే నిబంధనపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, వెంటనే సడలింపు ఇవ్వాలని జువ్వల రాంబాబు విజ్ఞప్తి చేశారు.



# జిల్లాలోని ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి




**భీమవరం, సెప్టెంబర్ 9:** జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణను మెరుగుపరచడం, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన రోడ్డు భద్రతా కమిటీ సమీక్ష సమావేశంలో రవాణా, పోలీస్, ఆర్ అండ్ బి, వైద్యశాఖ, మునిసిపల్, ఎన్.హెచ్, విద్యా శాఖ, ఆర్ టి సి, ఆర్ డి ఓ లు అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన భద్రత చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వివరాలు, ప్రమాదాలకు కారణమవుతున్న అంశాలు, ప్రమాద ప్రాంతాల గుర్తింపు, ట్రాఫిక్ నియమాల అమలు అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి సూచనలు జారీ చేశారు. ముఖ్యంగా జాతీయ, రాష్ట్ర రహదారులు పై బ్లాక్ స్పాట్స్ గుర్తించి ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల వద్ద ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. ప్రమాదాలు సంబంధించిన వెంటనే ప్రమాదం చేసిన డ్రైవర్లతోపాటు, రహదారి పైన పశువులు యజమాని పై కూడా కేసులు నమోదు చేయాలని అన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. మైనర్ లు డ్రైవింగ్‌ను అరికట్టాలని అన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించా లన్నారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, వీధి దీపాల ఏర్పాటు వంటి చర్యలను చేపట్టాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా వినూత్నమైన ఆలోచనలతో అధికారులు కార్యాచరణ రూపొందించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్నారు. జిల్లాలో నమోదైన రోడ్డు ప్రమాదాల గణాంకాలను నెలవారి సమీక్షించి, ప్రమాదాలకు గల కారణాలపై విస్తృతంగా చర్చించారు. ద్విచక్ర వాహనాల ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా అధిక వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి వహించాలన్నారు. కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రత నియమ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వాహనదారులు హెల్మెట్ వాడకపోవడం, సెల్ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవ్ చేయడం, త్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, రోడ్ల మలుపు ప్రాంతాలలో ఎక్కువగా ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. పట్టణ ప్రాంతాలలో పార్కింగ్ ప్రదేశాలు నిర్దేశించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారురు. పట్టణాలలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని అన్నారు. జిల్లాలో ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా అధికారులు వినూత్నమైన ఆలోచనలతో కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

**పీఎం రాహత్ (రావీ-=ూనాఖు) పథకం:** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి అత్యవసర సమయంలో నగదు లేకపోయినా క్యాష్‌లెస్‌గా చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందని అన్నారు. ఈ పథకం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. ప్రమాద బాధితుడికి గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు క్యాష్‌లెస్ వైద్యం చేయించుకోవచ్చని అన్నారు. మోటారు వాహనం కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. పథకంలో గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోవచ్చని అన్నారు. ఆసుపత్రి అర్హత ఉన్న బాధితుడికి చికిత్స నిరాకరిస్తే అది పథకం నిబంధనలకు విరుద్ధమని అన్నారు. ప్రమాదం సంభవించి గోల్డెన్ అవర్ లో బాధితులను దగ్గరలోని ఆసుపత్రికి తరలించిన వారికి 25 వేల రూపాయలు నగదు బహుమతి అందజేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. మైనర్ లు ఎవరు కూడా వాహనాలు నడిపి ప్రాణాలు పోగొట్టుకోవద్దని తెలిపారు. ఆక్సిడెంట్ కేసులను ఎప్పటికప్పుడు యాప్ లో అప్డేట్ చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కల్ప శ్రీ, భీమవరం ఆర్డిఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, నరసాపురం ఆర్డీవో దాసిరాజు, తాడేపల్లిగూడెం ఆర్డిఓ సూర్యారావు, డి టి ఓ కె ఎస్ ఎం ఎన్ కృష్ణారావు, నర్సాపురం డి.ఎస్.పి మేక సుధాకర్, డిఇఓ ఓవిఎస్ అనిల్ కుమార్, భీమవరం మున్సిపల్ కమిషనర్, పాలకొల్లు మున్సిపల్ కమిషనర్ వీరబ్రహ్మం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి హెచ్ వి భరత్ లక్ష్మి, ఎన్ హెచ్ 216 పిడి సాయి శ్రీనివాస్, ఈఈ పంచాయతీరాజ్ ఇ. భాస్కర్, 108 సర్వీసెస్ అధికారి కే. రాజు, పోలీసు శాఖ, రవాణా శాఖ, రోడ్లు భవనాల శాఖ,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వేలాదిమందితో లోక్‌భవన్‌ను ముట్టడించిన బీఎస్పీ

ఉద్రిక్తతల అనంతరం బీఎస్పీ నేతలతో గవర్నర్ అబ్దుల్ నజీర్ సమావేశం

దళితులపై దాడులు, హత్యలు, సామాజిక వివక్షపై గవర్నర్‌కు ఫిర్యాదు



**విజయవాడ: సెప్టెంబర్ 9:** రాష్ట్రంలో దళితులు, బహుజనులపై జరుగుతున్న హత్యలు, దాడులు, అణచివేతలు, సామాజిక వివక్షకు నిరసనగా బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో వేలాదిమంది కార్యకర్తలు ఆంధ్రప్రదేశ్ లోక్‌భవన్‌ను ముట్టడించారు. బీఎస్పీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దళితులకు రక్షణ కల్పించడంలో, బాధితులకు సకాలంలో న్యాయం అందించడంలో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం విఫలమవుతున్నాయని ఆరోపిస్తూ బీఎస్పీ శ్రేణులు లోక్‌భవన్ వద్దకు చేరుకున్నారు. నిరసనకారులను అడ్డుకునేందుకు పోలీసులు భారీగా మోహరించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా పోలీసులు, బీఎస్పీ కార్యకర్తల మధ్య తోపులాటలు చోటుచేసుకున్నాయి. పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని నిర్బంధించినట్లు బీఎస్పీ వర్గాలు తెలిపాయి. అయినప్పటికీ బీఎస్పీ శ్రేణులు వెనక్కి తగ్గకుండా తమ నిరసనను కొనసాగించాయి. దళితులపై జరుగుతున్న దాడులకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని, బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని వారు నినదించారు.

**సాయంత్రం గవర్నర్‌తో బీఎస్పీ నేతల సమావేశం**

ఉదయం జరిగిన లోక్‌భవన్ ముట్టడి నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ సాయంత్రం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ నాయకత్వంలోని పార్టీ ముఖ్య నాయకులను లోక్‌భవన్‌లో సమావేశానికి ఆహ్వానించి మాట్లాడారు. సమావేశంలో రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న హత్యలు, దాడులు, వేధింపులు, సామాజిక వివక్ష, దళితులపై దాడుల కేసుల్లో పోలీసుల జాప్యం, బాధితులకు న్యాయం అందకపోవడం, నిందితులపై చర్యలు తీసుకోవడంలో జరుగుతున్న నిర్లక్ష్యం వంటి పలు అంశాలను బీఎస్పీ నాయకులు గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. దళితులపై దాడులు జరిగిన సందర్భాల్లో కేసుల నమోదు నుంచి దర్యాప్తు వరకు జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని, బాధిత కుటుంబాలకు తగిన భద్రత కల్పించాలని, నిందితులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకులు గవర్నర్‌ను కోరారు. బీఎస్పీ నాయకులు ప్రస్తావించిన అంశాలపై గవర్నర్ అబ్దుల్ నజీర్ సానుకూలంగా స్పందించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన నివేదికను ప్రభుత్వాన్ని కోరుతానని గవర్నర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో దళితులు భయపడే పరిస్థితి ఉండకూడదని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలని పేర్కొన్నారు. దళితులపై దాడులు జరిగినప్పుడు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోలీసులు చట్టప్రకారం వ్యవహరించాలని డిమాండ్ చేశారు. దళితులు, బహుజనులపై జరుగుతున్న దాడుల విషయంలో బీఎస్పీ మౌనంగా ఉండబోదని, బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఉదయం వేలాదిమంది బీఎస్పీ శ్రేణులతో లోక్‌భవన్ ముట్టడి నిర్వహించడం, అనంతరం అదే రోజు సాయంత్రం గవర్నర్ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్‌తో పాటు ముఖ్య నాయకులతో సమావేశం కావడం రాష్ట్రంలో దళితుల సమస్యలపై బీఎస్పీ చేపడుతున్న ఉద్యమానికి ప్రాధాన్యతను తెలియజేస్తోందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

# ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఉత్తరాంధ్రలో మూడు రోజులు వర్షాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ఉత్తర బంగాళాఖాతంలో రేపు (గురువారం) అల్పపీడనం ఏర్పడనుందని, దీని ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలో, ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ మార్పులను గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ఈ అల్పపీడన ప్రభావంతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పాటు, కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వర్షం కురుస్తున్నప్పుడు, ముఖ్యంగా ఉరుములు, పిడుగులు పడే సమయంలో



ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని హెచ్చరించారు. చెట్ల కింద, భారీ హోర్డింగుల వద్ద, శిథిలమైన నిర్మాణాల దగ్గర నిలబడటం ప్రమాదకరమని స్పష్టం చేశారు. గురువారం: శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. శుక్రవారం: ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తాయి. మిగిలిన జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి జల్లులు పడొచ్చని అంచనా వేస్తున్నారు. శనివారం: విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయని విపత్తుల శాఖ పేర్కొంది. ఈ అల్పపీడన కదలికలను, వాతావరణ మార్పులను అధికారులు నిశితంగా గమనిస్తున్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కండి: జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

- శాఖల సమన్వయంతో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి
- సమస్యాత్మక ప్రాంతాలు, రహదారుల గుర్తింపు, పటాల రూపకల్పన పూర్తి చేయాలి...
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై బైండోవర్ చర్యలు చేపట్టాలి...

**భీమవరం, సెప్టెంబర్ 9:** జిల్లాలో త్వరలో జరగనున్న మున్సిపల్, పంచాయతీరాజ్ స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా, అన్ని శాఖల మధ్య సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి వాటిని సున్నిత ప్రాంతాలుగా గుర్తిస్తూ పటాల రూపకల్పన ప్రక్రియను పూర్తి చేయాలని పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఆయా ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక రహదారులను ముందుగానే గుర్తించి మార్గ పటాలను సిద్ధం చేయాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది, భద్రతా సిబ్బంది రాకపోకలకు అవసరమైన మార్గాలను ముందుగానే గుర్తించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా కుల, మతపరమైన అంశాలకు సంబంధించి ఉద్రిక్తతలు లేదా ఘర్షణలు చోటుచేసుకునే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక సదు-పాయాలు, సిబ్బంది, రవాణా, భద్రత తదితర అంశాలపై ముందస్తుగా సమీక్షించుకుని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించే వ్యక్తులను, ఎన్నికల సమయంలో సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వారిని ముందుగానే గుర్తించి వారిపై నిబంధనల ప్రకారం బైండోవర్ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖల అధికారులు సమష్టి బాధ్యతతో పనిచేయాలని ఆమె స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని విధాలా సిద్ధంగా ఉంటుందని తెలిపారు. జిల్లాలోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి, నిబంధనల ప్రకారం బైండోవర్ చర్యలు చేపడతామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా కుల, మతపరమైన ఉద్రిక్తతలకు అవకాశం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఆయా ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రత కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ, డిఆర్ఓ పి గ్లోరియా, జిల్లా రవాణా శాఖ అధికారి ఎం వివి కృష్ణారావు, ఆర్డీవోలు సూర్యారావు, కె ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసి రాజు, రహదారులు భవనాల శాఖ ఎస్ సి ఏ శ్రీనివాస్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్నా చేస్తే మక్కెలు విరగ్గొడతారా చింతమనేని గారు? ఇదేనా మీ ప్రజాస్వామ్యం?"

"మీ బెదిరింపులకు నేను భయపడను...
మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ కొటారు అబ్బాయి చౌదరి

**దెందులూరు:** ధర్నాలు చేస్తే మొక్కలు విరగగొడతారా ఇదేనా ప్రజాస్వామ్యం ఒక ఎమ్మెల్యే మాట్లాడాల్సిన భాష ఇదేనా అంటూ దెందులూరు మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ కొటారు అబ్బయ్య చౌదరి ప్రశ్నించారు. బుధవారం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి కార్యాలయంలో విడుదల చేసిన ప్రకటనలో ఇలాంటి బెదిరింపులకు వైఎస్సార్సీపీ శ్రేణులు భయపడవు" అన్నారు. మక్కెల గురించి కాదు-దమ్ముంటే దెందులూరు అభివృద్ధిపై లెక్కలతో నాతో చర్చకు రండి""2019లో రాజకీయ సన్యాసం అన్నారు... ఇప్పుడు మళ్లీ రాజీనామా డ్రామా ఎందుకు?" "డీఎస్సీలో అక్రమాలు లేవంటే స్వతంత్ర దర్యాప్తుకు సిద్ధపడండి" "న్యాయంగా ఉద్యోగం పొందిన అభ్యర్థులపై మా పోరాటం కాదు-అక్రమాలకు పాల్పడిన వారిపైనే" ఈ రోజు దెందులూరు వైఎస్సార్సీపీ కార్యాలయంలో ప్రస్తుత ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వ్యాఖ్యలు, దెందులూరు అభివృద్ధి, విద్యా రంగం, డీఎస్సీ నియామకాలపై వస్తున్న ఆరోపణల గురించి నేను మాట్లాడాను. ముందుగా చింతమనేని ప్రభాకర్ గారిని నేను ఒక సూటి ప్రశ్న అడుగుతున్నాను. ప్రతిపక్షం ధర్నా చేస్తే, నిరుద్యోగులు తమకు న్యాయం కావాలని రోడ్డెక్కితే "మక్కెలు విరగ్గొడతాం" అని బెదిరించడం ఒక ప్రజాప్రతినిధి మాట్లాడాల్సిన భాషేనా?

**ప్రజలు ప్రశ్నిస్తే సమాధానం చెప్పాలి.**

నిరుద్యోగులు నిరసన చేస్తే వారి సమస్యలు వినాలి. ప్రతిపక్షం ధర్నా చేస్తే రాజకీయంగా ఎదుర్కోవాలి. కానీ "మక్కెలు విరగ్గొడతాం" అనే భాషలో బెదిరించడం ప్రజాస్వామ్యం కాదు. చింతమనేని గారు... మీ బెదిరింపులకు నేను భయపడను. దెందులూరు వైఎస్సార్సీపీ కార్యకర్తలు భయపడరు. ఇలాంటి మాటలతో కొఠారు అబ్బయ్య చౌదరిని గానీ, వైఎస్సార్సీపీ శ్రేణులను గానీ వెనక్కి నెట్టగలమని అనుకుంటే అది మీ భ్రమ.
మాకు ప్రజలను ప్రశ్నించే హక్కు ఉంది.
అన్యాయం జరిగితే పోరాడే హక్కు ఉంది.
నిరుద్యోగుల పక్షాన నిలబడే బాధ్యత ఉంది.
మా గొంతు బెదిరింపులతో మూయించలేరు.
మక్కెల గురించి కాదు చింతమనేని గారు- అభివృద్ధి లెక్కలు చెప్పండి చింతమనేని ప్రభాకర్ గారు మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.

**నేను ఆయనను అడుగుతున్నాను:**

**మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్న మీరు దెందులూరు నియోజకవర్గానికి, ప్రభుత్వ పాఠశాలలకు, విద్యార్థులకు చేసిన అభివృద్ధి ఏమిటి**

మా ప్రభుత్వ హయాంలో దెందులూరు నియోజకవర్గంలోని సుమారు 150 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచాం. తాగునీటి సదుపాయం నుంచి డిజిటల్ స్క్రీన్ల వరకు ఎన్నో సౌకర్యాలు తీసుకొచ్చాం. కొవ్వలి, దెందులూరు, పెదపాడు, పోతునూరు సహా అనేక



ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశాం. విద్యార్థులకు పుస్తకాలు, విద్యా సామగ్రి, ట్యాబ్‌లు అందించాం. జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందించాం. నేను చేసిన అభివృద్ధి లెక్కలు తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నాను. చింతమనేని గారు కూడా మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి లెక్కలు తీసుకురండి. ప్రజల మధ్య బహిరంగంగా చర్చిద్దాం.

**మక్కెలు విరగ్గొడతాం అనే డైలాగులు కాదు - దమ్ముంటే లెక్కలతో చర్చకు రండి.**

మీరు ఎగతాళి చేసిన సచివాలయంలోనే ఇప్పుడు పోలీస్ స్టేషన్ ఎందుకు గతంలో గ్రామ సచివాలయాలను ఎగతాళి చేసిన చింతమనేని ప్రభాకర్ గారిని మరో ప్రశ్న అడుగుతున్నాను. మా ప్రభుత్వ హయాంలో నిర్మించిన పెదపాడు సచివాలయ భవనాన్ని ఇప్పుడు పోలీస్ స్టేషన్‌గా ఎందుకు ఉపయోగిస్తున్నారు సచివాలయ భవనాలు పనికిరావని చెప్పిన మీరే, మేము నిర్మించిన భవనాన్ని ఉపయోగించుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్న మీరు ఒక కొత్త పోలీస్ స్టేషన్ భవనానికి నిధులు తీసుకురాలేకపోయారా?

**ఇదే మీ అభివృద్ధా?**

డీఎస్సీలో అక్రమాలు లేవంటే విచారణకు ఎందుకు భయం?
డీఎస్సీ నియామకాలపై రాష్ట్రవ్యాప్తంగా అనేక ఆరోపణలు, అనుమానాలు వస్తున్నాయి.

**మేము ఒకటే కోరుతున్నాం.**

నిజం బయటకు రావాలి. న్యాయంగా చదివి మెరిట్‌తో ఉద్యోగం పొందిన అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బంది రావద్దు. కానీ అక్రమంగా ఎవరైనా చొరబడితే వారిపై చర్యలు తీసుకోవాలి. మా పోరాటం న్యాయంగా ఉద్యోగం పొందిన వారి మీద కాదు. అక్రమంగా ఉద్యోగాల్లోకి ప్రవేశించిన వారిపైన, అలాంటి అక్రమాలకు సహకరించిన వారిపైనే మా పోరాటం. డీఎస్సీలో అక్రమాలు జరగలేదని ప్రభుత్వం, చింతమనేని గారు అంత ధైర్యంగా చెబుతున్నప్పుడు,

**స్వతంత్ర దర్యాప్తుకు ఎందుకు భయపడుతున్నారు?**

"మీరు అడిగితే మేమెందుకు చేస్తాం?" అనే అహంకార ధోరణితో మాట్లాడటం సమాధానం కాదు. అక్రమాలు లేవంటే దర్యాప్తు చేయించండి. నిజం ప్రజల ముందుకు తీసుకురండి. "2019లో రాజకీయ సన్యాసం అన్నారు... ఇప్పుడు మళ్లీ రాజీనామా డ్రామా ఎందుకు?"
చింతమనేని ప్రభాకర్ గారు ఇప్పుడు "డీఎస్సీలో అక్రమాలు నిరూపిస్తే మొదటి రాజీనామా నాదే" అంటూ మాట్లాడుతున్నారు.

**నేను ఆయనను సూటిగా అడుగుతున్నాను:**

చింతమనేని గారు... రాజీనామా, రాజకీయ సన్యాసం అంటూ సవాళ్లు చేయడం మీకు కొత్త కాదు. 2019లో కూడా రాజకీయ సన్యాసం అంటూ బహిరంగంగా మాట్లాడారు. ఆ మాటలు ఏమయ్యాయి? ఇప్పుడు మళ్లీ "మొదటి రాజీనామా నాదే" అంటూ కొత్త డ్రామా ఎందుకు ప్రజలకు మీ రాజీనామా అవసరం లేదు నిజం కావాలి.నిరుద్యోగులకు మీ డైలాగులు అవసరం లేదు న్యాయం కావాలి. డీఎస్సీలో అక్రమాలు లేవంటే ఆధారాలతో నిరూపించండి. స్వతంత్ర దర్యాప్తుకు మద్దతు ఇవ్వండి."2019లో చేసిన రాజకీయ సన్యాసం సవాళ్లకే సమాధానం లేదు. ఇప్పుడు మరో రాజీనామా సవాల్ ఎందుకు? ముందు పాత మాటలకు సమాధానం చెప్పండి. రాజీనామా డ్రామాలు ఆపి డీఎస్సీపై ప్రజలకు సమాధానం చెప్పండి." "మక్కెలు విరగ్గొడతాం అనే బెదిరింపులు... రాజీనామా చేస్తాననే డైలాగులు ఇవి రెండూ పక్కన పెట్టండి. దమ్ముంటే దెందులూరు అభివృద్ధిపై లెక్కలతో చర్చకు రండి; డీఎస్సీలో అక్రమాలు లేవని ఆధారాలతో నిరూపించండి."
డీఎస్సీపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అంశాలు

**డీఎస్సీ నియామకాలకు సంబంధించి ప్రస్తుతం వస్తున్న ఆరోపణల్లో:**

- స్పోర్ట్స్ కోటాలో నకిలీ లేదా అనుమానాస్పద సర్టిఫికెట్ల వినియోగం;
- మెరిట్ జాబితా, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌పై వస్తున్న ఫిర్యాదులు;
- జూడో, బాక్సింగ్ తదితర స్పోర్ట్స్ సర్టిఫికెట్లపై వస్తున్న సందేహాలు;
- టెట్ అర్హత, పోస్టుల కేటాయింపు ప్రక్రియపై అనుమానాలు;
- ఉద్యోగాల కోసం భారీ మొత్తాల్లో ముడుపులు అడిగారనే ఆరోపణలు;
- ప్రశ్నపత్రాల భద్రతపై వ్యక్తమవుతున్న అనుమానాలు;
- మొత్తం నియామక ప్రక్రియ పారదర్శకతపై నిరుద్యోగుల్లో నెలకొన్న సందేహాలు ఉన్నాయి.

ఈ అంశాలన్నింటిపైనా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు ప్రజల కు స్పష్టమైన వివరణ ఇవ్వాలి

## సంక్షేమం గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు..

పెన్షన్లపై వాస్తవాలు ఇవిగో!: మంత్రి కొండపల్లి శ్రీనివాస్
6 లక్షల పెన్షన్లు తొలగించామన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్న కొండపల్లి శ్రీనివాస్
హామీ మేరకు పెన్షన్‌ను రూ.4,000కు పెంచామని వెల్లడి
గత ప్రభుత్వం 5 ఏళ్లలో చేయలేనిది 26 నెలల్లో చేసి చూపించామన్న మంత్రి
అర్హుల నుంచి కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

సంక్షేమం గురించి మాట్లాడే నైతిక అర్హత వైసీపీకి లేదని, కూటమి ప్రభుత్వంపై ఆ పార్టీ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమలు, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు పెన్షన్‌ను రూ.3,000 నుంచి రూ.4,000కు పెంచి మాట నిలబెట్టుకున్నారని స్పష్టం చేశారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం ఏటా కేవలం రూ.250 చొప్పున పెంచుతూ ఐదేళ్లు కాలయాపన చేసిందని మంత్రి విమర్శించారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంచిందని, ఏప్రిల్ నుంచి బకాయిలతో సహా లబ్ధిదారులకు అందించిందని గుర్తుచేశారు. "గత ప్రభుత్వం ఐదేళ్లలో పెన్షన్లకు ఖర్చు చేసింది రూ.91,000 కోట్లు మాత్రమే. కానీ మా కూటమి ప్రభుత్వం కేవలం 26 నెలల్లోనే రూ.73,000 కోట్లను నేరుగా లబ్ధిదారుల చేతిలో పెట్టింది," అని ఆయన వివరించారు.

**6 లక్షల పెన్షన్లు తొలగించామన్నది పచ్చి అబద్ధం**

ప్రభుత్వం 6 లక్షల పెన్షన్లను తొలగించిందంటూ మాజీ మంత్రి బూడి ముత్యాల నాయుడు చేస్తున్న ఆరోపణలను కొండపల్లి శ్రీనివాస్ తీవ్రంగా తప్పుబట్టారు. ఇది పూర్తిగా అవాస్తవమని, బాధ్యతగల పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి అసత్యాలు మాట్లాడటం శోచనీయమని అన్నారు. ప్రభుత్వం ఏర్పడే నాటికి రాష్ట్రంలో 65 లక్షల పెన్షన్లు ఉండగా, ప్రస్తుతం 62.10 లక్షల మందికి అందుతున్నాయని తెలిపారు. సుమారు 4.5 లక్షల మంది లబ్ధిదారులు సహజంగా మరణించడం వల్లే ఈ సంఖ్య తగ్గిందని, ప్రభుత్వం తొలగించినవి కేవలం 3,000 మాత్రమేనని, అవి కూడా నిర్దిష్ట ఫిర్యాదుల ఆధారంగా విచారణ జరిపిన తర్వాతేనని స్పష్టం చేశారు.
అంతేకాకుండా, ఈ 26 నెలల్లోనే కొత్తగా 2.60 లక్షల మందికి స్పౌస్ పెన్షన్లు మంజూరు చేశామని, గత ప్రభుత్వంలో భర్త చనిపోయినా పెన్షన్ అందని లక్ష మంది అర్హులైన మహిళలకు తమ ప్రభుత్వమే న్యాయం చేసిందని తెలిపారు.

**సంక్షేమంలో విప్లవాత్మక మార్పులు**

సీఎం చంద్రబాబు పెన్షన్ల వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని మంత్రి కొనియాడారు. గతంలో వరుసగా మూడు నెలలు పెన్షన్ తీసుకోకపోతే కార్డు రద్దు చేసేవారని, ఇప్పుడు మూడు నెలల పెన్షన్‌ను ఒకేసారి తీసుకునే సౌలభ్యం కల్పించామన్నారు. పెన్షనర్ చనిపోతే వెంటనే వారి జీవిత భాగస్వామికి పెన్షన్ అందేలా 'స్పౌస్ పెన్షన్' విధానం అమలు చేస్తున్నామని చెప్పారు. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3,000 నుంచి రూ.6,000కు, డయాలసిస్ బాధితులకు రూ.5,000 నుంచి రూ.10,000కు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.5,000 నుంచి రూ.15,000కు పెంచి ఆదుకుంటున్నామన్నారు.

**అర్హులందరికీ పెన్షన్.. పారదర్శక పాలన**

అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా కొత్త దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించామని, ఇప్పటికే రెండు రోజుల్లో 2.30 లక్షల దరఖాస్తులు వచ్చాయని మంత్రి తెలిపారు. దరఖాస్తుల పరిశీలనకు పాత నిబంధనలనే అనుసరిస్తున్నామని, ఎలాంటి మార్పులు చేయలేదని స్పష్టం చేశారు. దేశంలోనే అత్యధికంగా ఏటా రూ.33,000 కోట్లను పెన్షన్ల కోసం ఖర్చు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, ఇది తెలంగాణ కంటే నాలుగు రెట్లు అధికమని పోల్చారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు రివర్స్ టెండరింగ్‌తో నాశనమైన పోలవరం వంటి ప్రాజెక్టులను చక్కదిద్దుతూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని, వైసీపీ నేతలు చేస్తున్న విష ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.



## తిరుమల నడక మార్గంలో మళ్లీ చిరుత.. భక్తుల భయాందోళన

తిరుమల శ్రీవారి దర్శనానికి పాదయాత్రగా వెళ్లే భక్తులను వన్యమృగాల భయం మరోసారి వెంటాడింది. అలిపిరి నడకమార్గంలో చిరుత పులి సంచారం కలకలం రేపింది. మెట్ల మార్గంలో 7వ మైలు దాటిన తర్వాత మండపం సమీపంలో చిరుత కనిపించడంతో భక్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కొందరు భయంతో కేకలు వేస్తూ వెనక్కి పరుగులు తీశారు. రెండు రోజుల క్రితం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నరసింహ స్వామి ఆలయానికి సమీపంలో చిరుత సంచరించినట్లు కొందరు భక్తులు తెలిపారు. తాజాగా 7వ మైలు వద్ద మరోసారి కనిపించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వరుస ఘటనలతో నడకమార్గంలో వెళ్లేందుకు భక్తులు జంకుతున్నారు. ముఖ్యంగా పిల్లలతో, వృద్ధులతో కలిసి ప్రయాణించే వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ సమాచారం అందిన వెంటనే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విజిలెన్స్ అధికారులు, అటవీ శాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నడకమార్గంలో కీలక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం భక్తులను ఒంటరిగా అనుమతించకుండా, గుంపులుగా మాత్రమే పంపిస్తున్నారు. చిరుత సంచరించినట్లు చెప్పిన ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది గస్తీని ముమ్మరం చేశారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని, ధైర్యంగా గుంపులుగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా, తిరుమల నడకమార్గంలో చిరుతల సంచారం కొత్తేమీ కాదు. గతంలోనూ పలుమార్లు చిరుతలు, ఎలుగుబంట్లు కనిపించడంతో భక్తులు భయాందోళనకు గురైన



సంఘటనలు ఉన్నాయి. అప్పట్లో కూడా టీటీడీ ఇలాంటి భద్రతా చర్యలనే అమలు చేసింది.



# టాటా సన్స్ అధిపతి రేసులో ముగ్గురే..
# బరిలో నరేంద్రన్, అగర్వాల్, చౌహాన్‌లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: టాటా సన్స్ కొత్త చైర్మన్ రేసులో ముగ్గురే తలపడుతున్నారు. 275 బిలియన్ డాలర్లకుపైగా విలువైన బహుళ వ్యాపార దిగ్గజం టాటా గ్రూప్‌నకు టాటా సన్స్ హోల్డింగ్ కంపెనీ అనే విషయం తెలిసిందే. ప్రస్తుతం దీనికి ఎన్ చంద్రశేఖరన్ నాయకత్వం వహిస్తున్న సంగతీ విదితమే. 2017లో ఈ బాధ్యతల్లోకి వచ్చిన ఆయన రెండో విడుత ఐదేండ్ల టర్మ్ చేస్తున్నారు. అయితే గత నెలలో ఇక కొనసాగబోనని ప్రకటించారు. దీంతో వచ్చే ఏడాది ఫిబ్రవరి 20తో ఆయన ఉద్యోగ పదవీకాలం తీరిపోనున్నది. ఈ క్రమంలోనే నూతన సారథి కోసం అన్వేషణలు మొదలయ్యాయి. ఈ బరిలో టాటా స్టీల్ సీఈవో, ఎండీ టీవీ నరేంద్రన్, టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, గ్రూప్ సీఎఫ్‌వో సౌరభ్ అగర్వాల్‌తోపాటు ఎన్ఎస్ఈ ఎండీ, సీఈవో ఆశిష్ చౌహాన్ పేరు వినిపిస్తున్నది. నరేంద్రన్ ముందంజలో ఉన్నట్టు సమాచారం.కంపెనీ వార్తలను చదవండి



**ఇవెకోపై టాటా మోటర్స్ కన్ను**

ఇటాలియన్‌కు చెందిన కమర్షియల్ వాహన తయారీ సంస్థ ఇవెకోపై టాటా మోటర్స్ కన్ను పడింది. ఇప్పటికే బ్రిటన్‌కు చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ జేఎల్ఆర్‌ను హస్తగతం చేసుకున్న టాటా..తాజాగా ఇటాలియన్‌కు చెందిన ఇవెకోను వాలంటరీ టెండర్ ఆఫర్ ఇచ్చింది. షేరుకు 14.10 యూరో చొప్పున ఒప్పందం విలువ 3.82 బిలియన్ల యూరోలు ఉంటుందని అంచనా. ఈ ప్రత్యేక ఆఫర్ టీఎంఎల్ సీవీ హోల్డింగ్స్ బీవీ ద్వారా అందిస్తున్నట్టు, దీనికి సబంధించిన అంగీకార గడువు ఈ నెల 7 నుంచి అక్టోబర్ 26 వరకు ఉంటుందని ఇరు సంస్థలు ఒక ప్రకటనలో వెల్లడించాయి. ఈ ఒప్పందానికి ఇవెకో గ్రూపు బోర్డు డైరెక్టర్లు ఇప్పటికే ఆమోదముద్ర వేయగా, దీనికి కంపెనీకి చెందిన షేరు హోల్డర్లు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాల్సి వుంటుంది

# చుట్టుముట్టిన ఫెడ్ భయాలు



**భారీ నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు**

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఐటీ, చమురు, గ్యాస్ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడంతో చివరి అరగంటలో మదుపర్లు అమ్మకాలకు మొగ్గుచూపారు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు భగ్గుమనడం, అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను పెంచే అవకాశాలుండటం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. నష్టాల్లో ప్రారంభమైన సూచీలు చివరి వరకు అదే ట్రెండ్‌ను కొనసాగించాయి. వీటికి తోడు అమెరికా-ఇరాన్ దేశాల మధ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటుండటం సూచీల పతనానికి ఆజ్యంపోశాయి. ఇంట్రాడేలో 500 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ 76 వేల పాయింట్ల కిందకు పడిపోయాయి. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి గతవారం ముగింపుతో పోలిస్తే 382.62 పాయంట్లు నష్టపోయి 76,132.81 వద్ద స్థిరపడింది. 30 షేర్ల ఇండెక్స్ సూచీల్లో 23 షేర్లు నష్టపోగా, కేవలం ఏడు మాత్రమే లాభపడ్డాయి. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ 118.55 పాయింట్లు కోల్పోయి 23,779.15 వద్ద ముగిసింది. బ్లూచిప్ సంస్థల షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడం వల్లనే సూచీలు పతనం బాటపట్టాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. ప్రధానంగా అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను పెంచే అవకాశం ఉన్నట్టు వచ్చిన వార్తలు ఐటీ రంగ షేర్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. ప్రధానంగా ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్ షేర్లు 4 శాతం వరకు పతనం చెందాయి.

**ఇన్ఫోసిస్ షేరు 3.81 శాతం పతనం చెందిన టాప్ లూజర్‌గా నిలిచింది**

దీంతోపాటు జియోఫైనాన్స్, విప్రో, ఎస్బీఐలైఫ్ షేర్లు రెండు శాతానికి పైగా పతనం చెందాయి.

అలాగే టెక్ మహీంద్రా, టాటా స్టీల్, నెస్లె, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బజాజ్ ఫైనాన్స్, టీఎంపీవీ, అల్ట్రాటెక్ సిమెంట్, టీసీఎస్, ట్రెంట్, ఏషియన్ పెయింట్స్, ఎస్బీఐ, అదానీపోర్ట్స్, బజాజ్ ఆటో, రిలయన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఎటర్నల్ షేర్లు నష్టపోయాయి.

కానీ, ఐచర్ మోటర్స్, అపోలో హాస్పిటల్స్, కోల్ ఇండియా, సిప్లా, ఎల్అండ్‌టీ, భారతీ ఎయిర్‌టెల్, మ్యాక్స్‌హెల్త్, మారుతి, టాటా కన్స్యూమర్, పవర్ గ్రిడ్ షేర్లు లాభాల్లో ముగిశాయి.

రంగాలవారీగా ఫోకస్డ్ ఐటీ సూచీ అత్యధికంగా 2.17 శాతం నష్టపోగా, ఐటీ 2.11 శాతం, రియల్టీ 1.45 శాతం, మెటల్ 1.36 శాతం, పీఎస్‌యూ బ్యాంకింగ్ 1.09 శాతంతోపాటు కమోడిటీస్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు పతనాన్ని మూటగట్టుకున్నాయి.

కానీ, హెల్త్‌కేర్ ఇండస్ట్రీయల్స్, టెలికమ్యూనికేషన్స్ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.

# రికార్డు స్థాయిలో వాహన విక్రయాలు


న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7: వాహన విక్రయాలకు ఆగస్టు నెల అచ్చొచ్చింది. రికార్డు స్థాయిలో దేశవ్యాప్తంగా వాహనాలు అమ్ముడయ్యాయని ఆటోమొబైల్ తయారీదారుల సంఘం తాజాగా వెల్లడించింది. గత నెలలో 24,23,201 యూనిట్ల వాహనాలు అమ్ముడయ్యాయని సియామ్ తెలిపింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన వాహనాలతో పోలిస్తే 17.51 శాతం చొప్పున పెరిగాయని తెలిపింది. మందకొడి రుతుపవనాల కారణంగా వ్యాపార కార్యకలాపాలు మందగించినప్పటికీ, పండుగ సీజన్ ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ జీఎస్టీ 2.0 కల్పిస్తున్న ఆర్థిక ప్రయోజనాలతో వాహన అమ్మకాలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయని సియామ్ ప్రెసిడెంట్ సాయి గిరిధర్ తెలిపారు. దేశీయ చరిత్రలో తొలిసారిగా ప్యాసింజర్ వాహన అమ్మకాలు(సీఎన్‌జీంహైబ్రిడ్ంఈవీ) వాటా 41.95 శాతానికి చేరుకున్నాయని, అలాగే పెట్రోల్(40.85 శాతం) వాటా తగ్గిపోయాయి. సంస్థాగత సంస్కరణలకు పెద్దపీట వేయడంతోపాటు చమురుకు ప్రత్యామ్నాయంగా సీఎన్‌జీ, హైబ్రిడ్, ఎలక్ట్రిక్‌తో నడిచే వాహనాలు అందుబాటులోకి రావడంతో వీటికి డిమాండ్ అధికంగా ఉందన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఇంధన ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోతుండటంతో వాహన కొనుగోలుదారులు ప్రత్యామ్నాయాలకు మొగ్గుచూపారు. దీంతో ఈవీలు, సీఎన్‌జీ, హైబ్రిడ్ వాహనాలకు డిమాండ్ పెరిగిందని చెప్పారు. వీటికి తోడు గతేడాది ఆగస్టు నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టీ 2.0తో వాహన ధరలు భారీగా పడిపోవడం కూడా ఆటోమొబైల్ సంస్థలకు కలిసొచ్చింది.



పలు రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొంటుండటంతో భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తంచేశారు. ప్రధానంగా ట్రాక్టర్ల అమ్మకాలు ఫ్లాట్‌గా నమోదవుతున్నప్పటికీ, ఈ ఏడాది చివరి నాటికి తగ్గే అవకాశాలు కూడా ఉన్నాయన్నారు.

# తగ్గుతున్న ఉత్పత్తి.. పెరుగుతున్న ధరలు..
# కాపర్‌కు ఎందుకింత డిమాండ్?

అంతర్జాతీయ మార్కెట్లో రాగి (కాపర్) ధర చుక్కలనంటుతోంది. లండన్ మెటల్ ఎక్స్ఛేంజ్ (ఎల్ఎంఈ)లో రాగి ధర చారిత్రాత్మక గరిష్ఠ స్థాయికి చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. శుద్ధి చేసిన రాగిపై అమెరికా భారీగా సుంకాలు (టారిఫ్‌లు) విధించవచ్చన్న అంచనాలతో వ్యాపారులు పెద్ద ఎత్తున నిల్వలను అమెరికాకు తరలిస్తుండటమే ఈ అనూహ్య పెరుగుదలకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇవాళ ట్రేడింగ్‌లో ఎల్ఎంఈలో మూడు నెలల కాపర్ ఫ్యూచర్స్ ధర 0.8 శాతం పెరిగి మెట్రిక్ టన్నుకు 14,533 డాలర్ల (రూ. 13.73లక్షలు)వద్ద ఆల్ టైమ్ హైకి చేరింది. ఈ ఏడాది జనవరిలో నమోదైన 14,527.50 డాలర్ల (రూ. 13.72లక్షలు) రికార్డును ఇది అధిగమించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రాగి ధర సుమారు 17 శాతం పెరగ్గా, గత 12 నెలల్లో ఏకంగా 47 శాతం మేర వృద్ధిని నమోదు చేసింది. ఈ ప్రభావం దేశీయ మార్కెట్లపైనా స్పష్టంగా కనిపిస్తోంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో సెప్టెంబర్ కాపర్ ఫ్యూచర్స్ 1.21 శాతం (రూ. 16.8) పెరిగి ఉదయం 10:30 గంటలకే రూ. 1,403.50 ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ షేర్లు కూడా బీఎస్ఈలో 5 శాతానికి పైగా లాభపడి రూ. 537.35 వద్ద ట్రేడ్ అయ్యాయి. రాగి ధరల పెరుగుదలకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక కారణాలు రెండూ ఉన్నాయి. డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, పవర్ గ్రిడ్ల నుంచి డిమాండ్ విపరీతంగా పెరుగుతుండగా, పాత గనుల నుంచి ఉత్పత్తి ఆ స్థాయిలో పెరగడం లేదు. ఇది దీర్ఘకాలంగా ధరలకు మద్దతు ఇస్తోంది. అయితే, తాజా పెరుగుదలకు ప్రధాన కారణం అమెరికా టారిఫ్‌లకు సంబంధించిన పరిణామాలే. రిఫైన్డ్



కాపర్‌పై సుంకాల విషయంలో అమెరికా వాణిజ్య శాఖ జూన్ 30 నాటికి తన నివేదికను వైట్‌హౌస్‌కు ఇవ్వాల్సి ఉన్నా, రెండు నెలలు దాటినా తుది నిర్ణయం వెలువడలేదు. దీంతో వ్యాపారులు ముందుజాగ్రత్తగా తమ నిల్వలను అమెరికాకు తరలిస్తున్నారు. ఫలితంగా ఇతర ప్రాంతాల్లో, ముఖ్యంగా ఎల్ఎంఈ నెట్‌వర్క్‌లో రాగి లభ్యత తగ్గిపోయి ధరలు పెరుగుతున్నాయి. మరోవైపు, 2026 మొదటి అర్ధభాగంలో ప్రపంచవ్యాప్తంగా రాగి గనుల ఉత్పత్తి దాదాపు 1 శాతం తగ్గగా, కాన్సన్‌ట్రేట్ ఉత్పత్తి 2.6 శాతం క్షీణించినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇలా ఒకవైపు తగ్గుతున్న ఉత్పత్తి, మరోవైపు పెరుగుతున్న డిమాండ్, దానికి తోడు టారిఫ్ భయాలు.. అన్నీ కలిసి రాగి ధరలను రికార్డు స్థాయికి చేర్చాయి.

# సుజుకీ జిక్సర్ లుక్ మారింది..
# ధర రూ.1.37 లక్షల నుంచే

**155సీసీ మోడళ్లకు గ్రే-ఆరెంజ్ కలర్**

**250సీసీ బైక్‌లకు బ్లాక్-గ్రే కొత్త షేడ్**

**ఎస్ఎఫ్ 250 ఎఫ్ఎఫ్‌వీకి రెండు కొత్త రంగులు**

బైక్ ప్రియులకు సుజుకీ గుడ్‌న్యూస్ చెప్పింది. తన ప్రముఖ జిక్సర్ బైక్ రేంజ్‌ను కొత్త రంగులతో రిఫ్రెష్ చేసింది. జిక్సర్, జిక్సర్ ఎస్ఎఫ్, జిక్సర్ 250, జిక్సర్ ఎస్ఎఫ్ 250, జిక్సర్ ఎస్ఎఫ్ 250 ఎఫ్ఎఫ్‌వీ మోడళ్లకు కొత్త కలర్ ఆప్షన్లను తీసుకొచ్చింది. అయితే బైక్‌ల ఇంజిన్, చాసిస్, ఫీచర్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. ఈ అప్‌డేట్ పూర్తిగా లుక్ కోసమే. 155సీసీ జిక్సర్, జిక్సర్ ఎస్ఎఫ్ మోడళ్లకు మెటాలిక్ ఓర్ట్ గ్రే - పెర్ల్ బ్లేజ్ ఆరెంజ్ డ్యూయల్ టోన్ కలర్‌ను కొత్తగా జోడించారు. జిక్సర్ ధర రూ.1,37,221 నుంచి మొదలవుతుంది. జిక్సర్ ఎస్ఎఫ్ ధర రూ.1,40,729 నుంచి ఉంటుంది. ఈ రెండు బైక్‌లలో 155సీసీ సింగిల్ సిలిండర్ ఇంజిన్ కొనసాగుతుంది. 250సీసీ మోడళ్ల విషయానికి వస్తే.. జిక్సర్ 250, జిక్సర్ ఎస్ఎఫ్ 250కు గ్లాస్ స్పార్కిల్ బ్లాక్ - మెటాలిక్ ఓర్ట్ గ్రే కలర్‌ను కొత్తగా అందించారు. జిక్సర్ 250 ధర రూ.1,84,517 నుంచి మొదలవుతుండగా.. జిక్సర్ ఎస్ఎఫ్ 250 ధర రూ.1,92,768 నుంచి ప్రారంభమవుతుంది. ఈ రెండు బైక్‌లలో 249సీసీ ఆయిల్ కూల్డ్ ఇంజిన్ ఉంటుంది. ఇది 26.5పీఎస్ పవర్, 22.2ఎన్ఎం టార్క్ ఇస్తుంది. 6-స్పీడ్ గేర్‌బాక్స్, డ్యూయల్ ఛానల్ ఏబీఎస్ వంటి ఫీచర్లు కొనసాగుతాయి. ఇక జిక్సర్ ఎస్ఎఫ్ 250 ఎఫ్ఎఫ్‌వీ రెండు కొత్త కలర్ ఆప్షన్లతో వచ్చింది. గ్లాస్ స్పార్కిల్ బ్లాక్ - మెటాలిక్ ఓర్ట్ గ్రేతో పాటు పూర్తిగా గ్లాస్ స్పార్కిల్ బ్లాక్ కలర్ కూడా అందుబాటులోకి వచ్చింది. దీని ధర రూ.1,98,476గా ఉంది. ఇది ఈ85 వరకు ఇథనాల్ కలిసిన ఇంధనంతో పనిచేసే ఫ్లెక్స్-ఫ్యూయల్ బైక్. దీని ఇంజిన్ 27.9పీఎస్ పవర్, 22.5ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. కొత్త రంగులతో జిక్సర్ రేంజ్ లుక్‌లో మార్పు వచ్చినా.. పనితీరు, మెకానికల్ సెటప్‌లో మాత్రం ఎలాంటి మార్పు లేదు. ఈ బైక్‌లు దేశవ్యాప్తంగా సుజుకీ డీలర్‌షిప్‌లలో అందుబాటులో ఉంటాయి.





# రూ.200 కోట్ల 'ఇరుముడి' ఓటీటీలోకి..

ఓటీటీ ప్రేక్షకులకు అదిరిపోయే గుడ్‌న్యూస్. థియేటర్లలో సంచలన విజయాన్ని అందుకున్న మాస్ మహారాజా రవితేజ 'ఇరుముడి' ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఎమోషనల్ డ్రామా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో సత్తా చాటింది. ముఖ్యంగా రవితేజను మాస్ హీరోగా మాత్రమే కాకుండా ఒక బలమైన ఎమోషనల్ నటుడిగా చూపించిన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంది. ఇప్పుడు థియేట్రికల్ రన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ మూవీ.. ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.కొత్త సినిమాలు చూడండి 'నిన్ను కోరి', 'మజిలీ' వంటి ఎమోషనల్ కథలను తెరకెక్కించిన దర్శకుడు శివ నిర్వాణ.. రవితేజతో 'ఇరుముడి'ని తెరకెక్కించారు. విడుదలైన తొలి రోజు నుంచే ఈ సినిమాకు పాజిటివ్ పబ్లిక్ టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద వసూళ్లు స్థిరంగా కొనసాగాయి. ఇతర సినిమాల నుంచి పోటీ ఉన్నప్పటికీ.. 'ఇరుముడి' మాత్రం సుదీర్ఘంగా థియేటర్లలో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ క్రమంలోనే ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల గ్రాస్ మార్క్‌ను అందుకున్నట్లు సమాచారం. రవితేజ కెరీర్‌లో ఈ సినిమా మరో భారీ విజయంగా నిలిచింది. రవితేజ అంటే మాస్, కామెడీ, ఎనర్జిటిక్ యాక్షన్ అనే ఇమేజ్ ప్రేక్షకుల్లో బలంగా ఉంది. అయితే 'ఇరుముడి'లో శివ నిర్వాణ ఆయనలోని మరో కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేశారు. కుటుంబ బంధాలు, తండ్రీకూతుళ్ల మధ్య అనుబంధం, భావోద్వేగాల చుట్టూ కథను నడిపించిన తీరు ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేసిందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ముఖ్యంగా రవితేజ నటనలోని ఎమోషనల్ షేడ్స్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇప్పుడు ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్‌పై ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ 'ఇరుముడి' డిజిటల్ హక్కులను దక్కించుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. సెప్టెంబర్ 18 నుంచి ఈ సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ ఒకేసారి అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. అయితే స్ట్రీమింగ్ తేదీ, భాషల వివరాలపై నెట్‌ఫ్లిక్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. థియేటర్లలో 'ఇరుముడి'కి ప్రధాన బలంగా నిలిచిన అంశాల్లో రవితేజ నటనతో పాటు చిన్నారి నక్షత్రతో ఆయనకు సంబంధించిన ఎమోషనల్ సన్నివేశాలు కూడా ఉన్నాయి. ఈ సన్నివేశాలు ప్రేక్షకులను కదిలించాయని టాక్ వచ్చింది.

# పార్ట్ టైమర్స్' (జియో హాట్ స్టార్) సిరీస్ రివ్యూ!

ఓటీటీ ప్లాట్ ఫామ్స్ పైకి థ్రిల్లర్ నేపథ్యంలోని కథలు ఎక్కువగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అడపాదడపా మాత్రం యూత్ ను దృష్టిలో పెట్టుకుని రూపొందే సిరీస్ లు ఓటీటీ ట్రాక్ పై ప్రత్యక్షమవుతున్నాయి. అలా నిర్మితమైన సిరీస్ గా 'పార్ట్ టైమర్స్' కనిపిస్తుంది. తనూజ – జ్ఞానేశ్వరి కాంద్రేగుల ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్ నుంచి, 8 ఎపిసోడ్స్ అందుబాటులో వచ్చాయి. సంపత్ కుమార్ తోట దర్శకత్వం వహించిన ఈ సిరీస్ ఎలా ఉందనేది ఇప్పుడు చూద్దాం. తేజు (జ్ఞానేశ్వరి) శ్రీమంతుల కుటుంబానికి చెందిన అమ్మాయి. ఆమె తండ్రికి చాలా బిజినెస్ లు ఉంటాయి. కానీ తన కాళ్లపై తాను నిలబడాలనే ఉద్దేశంతో .. తనకి నచ్చినట్టుగా స్వేచ్ఛగా ఉండాలనే ఆలోచనతో ఆమె ఒక ఫ్లాట్ లో రెంట్ కి ఉంటుంది. క్యాబ్ నడుపుతూ తనకి ఖర్చులకి తగిన డబ్బును సంపాదించుకుంటూ ఉంటుంది. ఆవేశం .. లెక్కలేనితనం ఎక్కువ. అందువలన ఆ కమ్యూనిటీలో ఎవరికి కూడా ఆమె అంటే పడదు. లాంటి తేజుతో ఫ్లాట్ షేర్ చేసుకోవడానికి సింధు (తనూజ) వస్తుంది. సింధు తండ్రి లేని అమ్మాయి. తల్లితో కలిసి బాబాయ్ ఇంట్లో ఉంటూ ఉంటుంది. క్రమశిక్షణ పేరుతో బాబాయ్ ఆమెను ఇబ్బందిపెడుతూ ఉంటాడు. అంతేకాదు బంధువైన నవీన్ తో ఆమె పెళ్లి జరిపించడానికి ప్రయత్నాలు చేస్తుంటాడు. అది ఇష్టం లేని సింధు, ఆఫీసుకు దగ్గరగా ఉంటుందనే ఉద్దేశంతో రెంట్ కి దిగుతుంది. అయితే గతంలో సింధుతో జరిగిన గొడవను మనసులో పెట్టుకున్న తేజు, ఆమెతో కోపంగా ఉంటుంది. ప్రతి చిన్న విషయానికి సీరియస్ అవుతూ ఇబ్బంది పెడుతూ ఉంటుంది. సింధుని తేజు ఇబ్బంది పెడుతుందని గ్రహించిన కమ్యూనిటీ వాళ్లు, సింధును సపోర్ట్ చేయడం మొదలుపెడతారు. అదంతా సింధు చేయిస్తోందనే ఉద్దేశంతో ఆమెపై తేజు మరింత కోపాన్ని పెంచుకుంటుంది. కెరియర్ పరంగా ఇద్దరూ ఇబ్బందులలోనే ఉంటారు. ఆ పరిస్థితి నుంచి బయటపడటం కోసం వాళ్లు ఏం చేస్తారు? ఆ ప్రయత్నాలు ఫలిస్థాయా? వాళ్ల జీవితాలలో కొత్తగా చోటుచేసుకునే మలుపులు ఎలాంటివి? అనేది మిగతా కథ. కలవారి కూతురైన తేజు పంతానికిపోయి ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయి స్వేచ్ఛగా బ్రతుకుంటూ ఉంటుంది. సమస్యలను .. సవాళ్లను ఎదుర్కోవడానికి ఆమె సిద్ధంగా ఉంటుంది. ఇక పేదింటి అమ్మాయి అయిన సింధు, తనకి ఇష్టం లేని పెళ్లి సంబంధం నుంచి తప్పించుకోవడం కోసం బయటికి వస్తుంది. జీవితంలో తాము అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఇద్దరికీ ఉంటుంది. భిన్నమైన స్వభావాలను కలిగిన ఇద్దరు అమ్మాయిల చుట్టూ దర్శకుడు ఈ కథను అల్లుకుంటూ వెళ్లాడు.



# సూర్య స్టైలిష్ ఎంట్రీ అదిరింది.. స్టన్నింగ్‌గా 'సీన్' టైటిల్ టీజర్

ఇటీవలే విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమాతో మంచి సక్సెస్ అందుకున్నాడు కోలీవుడ్ స్టార్ హీరో సూర్య. ఈ టాలెంటెడ్ యాక్టర్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మరో ప్రాజెక్ట్ ాబతీఅఖు 47. 'ఆవేశం' లాంటి బ్లాక్‌బస్టర్ చిత్రాన్ని తెరకెక్కించిన జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాకు 'సీన్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు వార్తలు హల్ చల్ చేసిన విషయం తెలిసిందే. అయితే అభిమానుల్లో నెలకొన్న క్యూరియాసిటీకి చెక్ పెట్టారు మేకర్స్. చిత్రానికి ముందుగా వార్తలు వచ్చినట్టుగా సీన్ (ాఎవఅవ) టైటిల్‌ను ఫైనల్ చేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ టైటిల్ టీజర్ కూడా రిలీజ్ చేశారు. షార్ట్ అండ్ టీ షర్ట్‌లో నయా మేకోవర్‌లో కనిపిస్తూ స్టైలిష్ ఎంట్రీ ఇచ్చిఅదరగొట్టేస్తున్నాడు సూర్య. పోలీసాఫీసర్ భుజంపై చేయి వేసి జైలులో ఖైదీల మధ్య నుంచి నడుచుకుంటూ రావడం చూడొచ్చు. మొత్తానికి ఈ సారి సూర్యలోని నయా యాంగిల్‌ను చూపించబోతున్నట్టు టైటిల్ టీజర్ చెప్పకనే చెబుతోంది. ఈ మూవీలో సూర్యకు జోడీగా నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, 'ప్రేమలు' ఫేమ్ మలయాళ యువ నటుడు నస్లెన్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. విభిన్నమైన యాక్షన్–కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రముఖ మలయాళ సంగీత దర్శకుడు సుశిన్ శ్యామ్ పనిచేస్తున్నాడు. ఈ చిత్రాన్ని దీపావళి కానుకగా నవంబర్ 6, 2026న ఈ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.


# విజయ్ దేవరకొండ 'రణబాలి' టీజర్ విడుదల..!



టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న జంటగా నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'రణబాలి'కి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చింది. సూపర్ హిట్ చిత్రం 'టాక్సీవాలా' తర్వాత విజయ్ దేవరకొండ, టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాన్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాకు సంబంధించిన మాస్ యాక్షన్ టీజర్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఈ టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. 19వ శతాబ్దం (1854 -- 1878 మధ్య) బ్రిటిష్ పాలనా కాలం నాటి చారిత్రక నేపథ్యం, రాయలసీమ ప్రాంత ఆధిపత్య పోరాటాలు మరియు వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చారిత్రాత్మక కాన్వాస్ పై ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో విజయ్ దేవరకొండ శింగనమల బొబ్బిలి రణబాలి పాత్రలో కనిపించనుండగా, రష్మిక ఆయన భార్య జయమ్మ పాత్రలో అత్యంత సంప్రదాయబద్ధంగా, భావోద్వేగాలతో కూడిన పాత్రలో అలరించనున్నారు. అంతేకాకుండా, ఈ చిత్రంలో హాలీవుడ్ ప్రముఖ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ క్రూరమైన బ్రిటిష్ అధికారి పాత్రలో ప్రధాన విలన్‌గా నటిస్తుండటం సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్స్ అజయ్ -- అతుల్ ఈ చిత్రానికి ప్రాణం పోసేలా అదిరిపోయే సంగీతం అందిస్తున్నారు. టీ–సిరీస్ సంస్థ ఈ భారీ పాన్ ఇండియా చిత్రాన్ని సమర్పిస్తోంది. అన్ని కార్యక్రమాలను వేగంగా పూర్తి చేసుకుంటున్న ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 16, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. విడుదలైన మాస్ యాక్షన్ టీజర్‌తో సినిమాపై అంచనాలు మరింత తారాస్థాయికి చేరాయని, విజయ్ కెరీర్‌లోనే ఇదొక బిగ్గెస్ట్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుందని అభిమానులు గట్టి నమ్మకంతో ఉన్నారు.

# 'దృశ్యం 3'తో ఎండ్ కార్డ్.. మోహన్‌లాల్‌కు ఈ సినిమా చూపించాలని ఉంది : అజయ్ దేవగన్!

బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవగన్ నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ 'దృశ్యం' నుంచి రాబోతున్న తాజా చిత్రం 'దృశ్యం 3'తో ఈ సీరీస్‌కు ఘనమైన ముగింపు పలకనున్నట్లు మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. 'దృశ్యం 2' తర్వాత కథను ముందుకు తీసుకెళ్లడం కష్టతరమైన సవాల్‌గా మారినప్పటికీ, సరైన కథ దొరకడంతో ఈ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించినట్లు అజయ్ దేవగన్ తెలిపారు. సినిమా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడుతూ, కథను అనవసరంగా సాగదీయకుండా సరిగ్గా ముగించాలనే ఉద్దేశంతోనే మూడో భాగాన్ని తెస్తున్నామని స్పష్టం చేశారు. దర్శకుడు అభిషేక్ పాఠక్ సుమారు రెండేన్నర సంవత్సరాలు కష్టపడి అద్భుతమైన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారని, ఈ చిత్రం ప్రేక్షకులకు






మునుపటిలాగే అదిరిపోయే ట్విస్టులు ఇస్తుందని పేర్కొన్నారు.కొత్త సినిమాలు చూడండి మలయాళంలో మోహన్‌లాల్ నటించిన ఒరిజినల్ 'దృశ్యం' చిత్రాల స్ఫూర్తితోనే హిందీలో ఈ రీమేక్స్ రూపొందినప్పటికీ, 'దృశ్యం 3' మాత్రం మలయాళ వెర్షన్‌కు పూర్తిగా భిన్నమైన స్క్రిప్ట్‌తో తెరకెక్కుతోందని అజయ్ దేవగన్ స్పష్టం చేశారు. మలయాళ చిత్ర పరిశ్రమలో 'దృశ్యం' ఫ్రాంచైజీకి ఆద్యుడైన మోహన్‌లాల్ సర్ ఈ సినిమాను వీక్షించాలని తాను ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నానని, ఆయనకు ఈ చిత్రాన్ని చూపించాలనే కోరిక బలంగా ఉందని అజయ్ దేవగణ్ తన మనసులోని మాటను పంచుకున్నారు.




Printed, Published And Owned by YAMJALA PRAVEEN, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221, Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com